


PRGI NO TGTEL/26/A2948

# జ్యోతి శ్వేత

JYYOTHI SHWETHA

దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 82॥ సోమవారం॥ 17-8-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:02 సూర్యాస్తమయం - సా. 6:39 తిథి పాడ్యమి రా. 8:45 వరకు తరువాత విదియ సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ఆశ్లేష ఉ. 6:03 వరకు తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ) యోగం వారియ మ. 12:13 వరకు కరణం స్తుఘ్నమ ఉ. 9:53 వరకు బవ రా. 8:45 వరకు వర్జ్యం సా. 5:22 నుండి సా. 6:52 వరకు దుర్ముహూర్తం ఉ. 10:14 నుండి ఉ. 11:05 వరకు మ. 3:17 నుండి సా. 4:08 వరకు రాహుకాలం మ. 1:55 నుండి మ. 3:30 వరకు యమగండం ఉ. 6:02 నుండి ఉ. 7:36 వరకు గుళికాకాలం ఉ. 9:11 నుండి ఉ. 10:46 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:26 నుండి తె. 5:14 వరకు అమృత ఘడియలు తె. 4:36 నుండి ఉ. 6:05 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:46 వరకు గమనిక: “ం” అనగా మరుసటి రోజున





3

## ట్రంప్ పోస్టు.. కొరియాలో ఉద్రిక్తతలు

**కిమ్‌తో పాత ఫొటో పంచుకున్న ట్రంప్**

**సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా ఆగ్రహం**

**ద్వీపకల్పంలో మళ్లీ యుద్ధ మేఘాలు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ మధ్య ఉన్న సంబంధాలు మరోసారి అంతర్జాతీయ చర్చకు దారితీశాయి. ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ‘ట్రూత్ సోషల్’లో కిమ్‌తో కలిసి దిగిన పాత ఫొటోను పంచుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.



## వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా...

# ఏం చేయలేరు

**కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్.. నాది సోషల్ జస్టిస్.. పరకాల సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

ప్రజల కోసం ఎంతవరకైనా కష్టపడతానని మీ ఆశీర్వాదం ఉన్నంత వరకు వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా వెంట్రుక కూడా పీకలేరంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో పెడితే ఒరిగేది లేదు కరిగేదని, రేపు శాసనసభలోనే తేల్చుకుందామంటూ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తనకు సోదరి అని, రక్త సంబంధం లేకున్నా తాను సొంత సోదరిగా చూస్తానని అన్నారు. కానీ కేటీఆర్ అలా కాదు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

పరకాల–హనుమకొండ, ఆగస్టు 16: కేటీఆర్ ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని సొంత సోదరిని ఇంటి నుంచి బయటకు పంపించారని, సొంత చెల్లికే న్యాయం చేయని వాడు రాష్ట్రంలోని 2 కోట్ల మంది ఆడబిడ్డలకు న్యాయం చేస్తాడా? అని ప్రశ్నించారు. ములుగు జిల్లాలో పర్యటించిన సీఎం.. చేయూత పింఛన్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేసీఆర్ కుటుంబంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కుమార్తె పట్ల కుమారుడు దౌర్జన్యం చేస్తుంటే మందలించి బుద్ధి చెప్పాల్సిన తండ్రి ఫామ్ హౌస్‌లో పడుకున్నాడని... తరువాయి 2 వ పేజీలో..

## బండ్ల గణేశ్ కుమార్తె వివాహం..

**హాజరైన తెలుగు రాష్ట్రాల సీఎంలు**



అమరావతి : సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యతేజతో ఆదివారం ఘనంగా జరిగింది. రాయదుర్గం జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి హాజరయ్యారు. చంద్రబాబు, భువనేశ్వరి దంపతుల చేతుల మీదుగా కొత్తజంటకు తాళిని అందించారు. వేడుకలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తోపాటు ఉభయ రాష్ట్రాల్లోని పలువురు మంత్రులు, రాజకీయ, సినీ ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



## కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా

# ప్రభుత్వ టిమ్స్

**1,082 పడకలు.. 300 ఐసీయూలు.. 31 మేజర్ ఆపరేషన్ థియేటర్లు**

**నిమిషాల్లోనే పరీక్షల నమూనాల.. నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్**

సామాన్య ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ రంగంలోనే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం సనత్‌నగర్‌లో నిర్మించిన ప్రతిష్ఠాత్మక డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ప్రారంభానికి సిద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఆ ఆస్పత్రిని ప్రారంభించనున్నారు.

హైదరాబాద్, ఆగస్టు 16: అత్యాధునిక సాంకేతికత, భారీ మౌలిక వసతులు, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతో టిమ్స్ సనత్‌నగర్ ప్రభుత్వ వైద్యరంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పనుంది. 22.6 ఎకరాల విస్తీర్ణంలో 11.70 లక్షల చదరపు అడుగుల నిర్మిత విస్తీర్ణంతో ఈ సమగ్ర వైద్య సముదాయాన్ని నిర్మించారు. ఒకే దశలో, ఒకే మాస్టర్‌ప్లాన్‌తో రూపొందించిన ఈ ఆస్పత్రిలో 1,082 పడకలు ఉండగా.. అందులో 300 ఐసీయూ పడకలు ఉన్నాయి. ప్రభుత్వ రంగంలో ఒకే దశలో నిర్మించిన అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఇది ఒకటిగా నిలిచింది. టిమ్స్‌ను నాలుగు ప్రధాన బ్లాకులుగా నిర్మించారు. మొత్తం 31 మేజర్, -2 వ పేజీలో..



## జార్ఖండ్ ప్రభుత్వంపై విద్యార్థుల ఆగ్రహం

**కాంగ్రెస్ మద్దతు ఉపసంహరణకు డిమాండ్**

**ఆగస్టు 20న సీఎం నివాస ముట్టడికి పిలుపు**

**రాహుల్ గాంధీ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి**

రాంచి, ఆగస్టు 16: జార్ఖండ్‌లో జేఎంఎం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉపసంహరించాలని విద్యార్థి నిరసన కారులు కాంగ్రెస్ నేత రాహుల్ గాం ధీని డిమాండ్ చేశారు. ఆగస్టు 20న ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నివాసాన్ని -2 వ పేజీలో..



# చేయూత పింఛన్లకి శ్రీకారం

## సమ్మక్క--సారలమ్మలను దర్శించిన సీఎం

## వితంతు, ఒంటరి మహిళలకు పింఛన్లు

వనదేవతలు సమ్మక్క–సారలమ్మ సన్నిధిలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ములుగు జిల్లా పర్యటనలో భాగంగా మేడారం చేరుకున్న ముఖ్యమంత్రి ముందుగా సమ్మక్క–సారలమ్మ గద్దెలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులో భాగంగా సమ్మక్క–సారలమ్మలకు నిలువెత్తు బంగారం సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కను నాటారు.దముఖ్యమంత్రి రాక సందర్భంగా గిరిజన పూజారులు డోలు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానికంగా అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత పింఛన్లను పంపిణీ చేశారు.

# నేటి రాశి ఫలాలు

మేషం: సమాజంలో ప్రముఖులతో చర్చలకు అనుకూలమైన రోజు. వృత్తి వ్యాపారాలలో తీసుకున్న నిర్ణయాలు అనుకూలంగా సాగుతాయి. ఆలోచనలు అనుకూలంగా సాగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. భూ సంబంధిత క్రయ విక్రయాలు లాభిస్తాయి. ఉద్యోగమున సమస్యలు అధిగమిస్తారు.

వృషభం: చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు తప్పవు. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ అవసరం. ఆకస్మిక ధనవ్యయ సూచనలు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి, ఉద్యోగాలు అంతగా రాణించవు. వ్యాపారమున కీలక సమయంలో నిర్ణయాలు తీసుకోలేరు.

మిధునం: ఆర్థిక ఇబ్బందులు బాధిస్తాయి. దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి అధికమవుతుంది. కుటుంబ బాధ్యతలు మరింత చికాకు పరుస్తాయి. బంధుమిత్రులతో చిన్నపాటి వివాదాలు తప్పవు. నిరుద్యోగులకు నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఉద్యోగమున కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

కర్కాటకం: బంధు మిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. ముఖ్యమైన పనులలో అవరోధాలు కలిగిన అధిగమించి ముందుకు సాగుతారు. ఆకస్మిక ధన ప్రాప్తి కలుగుతుంది. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు లాభిస్తాయి. కుటుంబ సభ్యుల ఆదరణ పెరుగుతుంది. ఉద్యోగమున ఆలోచించి ముందుకు సాగడం మంచిది.

సింహం: కీలక సమయంలో బంధు మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో పరిస్థితులు అనుకూలంగా మారుతాయి. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలు విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగాలలో అనుకూలత పెరుగుతుంది.

కన్య: దీర్ఘకాలిక ఋణబాధలు తొలగుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. కుటుంబమున అవసరానికి కీలక నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన వ్యవహారాలు అనుకూలంగా సాగుతాయి. వ్యాపారమునకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది.

తుల: ఋణ దాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. మానసిక సమస్యలు చికాకు పరుస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వేయడం మంచిది. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి.

వృశ్చికం: చేపట్టిన పనులు శ్రమాధిక్యతతో కానీ పూర్తి కావు. ఆత్మ విశ్వాసంతో వివాదాల నుంచి బయటపడతారు. దూరప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. వ్యాపారాలలో ఇబ్బందులు ఎదురైనా అధిగమించి లాభాలు అందుకుంటారు. ఉద్యోగమున ధైర్యముగా నిర్ణయాలు చేస్తారు. ఆదాయం బాగుంటుంది.

ధనస్సు: ఇతరుల వ్యవహారాలలో తలదూర్చడం మంచిది కాదు. మీ ఆలోచనలు కుటుంబ సభ్యులకు నచ్చే విధంగా ఉండవు. చేపట్టిన పనులు మధ్యలో నిలిపివేస్తారు. ఆర్థిక పరంగా ఇబ్బందులు మరింత బాధిస్తాయి. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటాయి.

మకరం: చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దాయాదులతో భూ సంబంధిత వివాదాలు కొలిక్కి వస్తాయి. బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. ఉద్యోగమున వివాదాలు పరిష్కరించుకుంటారు. వృత్తి వ్యాపారాలలో ప్రయత్నాలు ఫలిస్తాయి.

కుంభం: చేపట్టిన పనులు నత్తనడకన సాగుతాయి. వృధా ఖర్చుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపారమున భాగస్తులతో చిన్నపాటి వివాదాలు తప్పవు. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఉద్యోగమున అధికారులతో వివాదాలు కలిగే సూచనలున్నవి.

మీనం: అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కొన్ని వ్యవహారాలలో ఇతరుల సహాయ సహకారాలు అందుతాయి. ధనదాయం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు అనుకూల ఫలితాలను ఇస్తాయి. సంతాన విద్యా విషయాల పట్ల సంతృప్తికరంగా సాగుతాయి.





# చేయూత పింఛన్లకి శ్రీకారం

## సమ్మక్క--సారలమ్మలను దర్శించిన సీఎం

## వితంతు, ఒంటరి మహిళలకు పింఛన్లు

**ములుగు, ఆగస్టు 16 :** రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి మేడారం నుంచే లాంఛనంగా శ్రీకారం చుట్టారు. మేడారానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. భక్తులకు పరిశుభ్రమైన తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. మహిళల ఉపాధి, ఆర్థిక అభివృద్ధి, సంఘాల కార్యకలాపాలపై వివరాలు తెలుసుకుని వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మంత్రులు దానసరి అనసూయ (సీతక్క), పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విప్ రామచంద్ర నాయక్, ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, పోరిక బాలరాం, కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మురళి నాయక్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా...ఏం చేయలేరు

మొదటి పేజీ తరువాయి

సొంత బిడ్డను ఇంటి నుంచి బయటకు వెళ్లగొడుతుంటే తండ్రి మౌనంగా ఉన్నాడంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కుమారుడు చేసిన నేరంలో తండ్రికి కూడా సగం భాగం ఉన్నట్లేనని అలాంటి తండ్రి కుమారుడు ఈ రోజు రాష్ట్రానికి పట్టిన శనీశ్వరులుగా తయారయ్యారని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. మరోవైపు మాజీమంత్రి హరీశ్ రావుపైనా నిప్పులు చెరిగారు. హరీశ్ రావు కాదని ఆయన అఘోర రావు అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.



హరీశ్ రావు అఘోరా పూజలు చేస్తున్నారని, ప్రజలు ఇబ్బందులు పడాలని పూజలు చేస్తున్నట్లు ఆరోపించారు. అయినా దేవుడు మనవైపు ఉండి వర్షాలు కురిపించాడన్నారు. ఇక అఘోరారావు యువతను రెచ్చగొడుతున్నాడని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రక్తదానం పేరుతో హరీశ్ రావు, కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల రక్తాన్ని ప్రైవేట్ ఆసుపత్రులకు అమ్ముకుని సంచలన ఆరోపణలు చేశారు. ఎప్పటికీ అధికారంలోనే ఉంటామని విర్రవీగిన వారిని వరంగల్ జిల్లా ప్రజలు బండకేసి కొట్టారని...తమను ఓడించేవారే లేరనుకున్న వారిని రాజకీయంగా బొందపెట్టారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాకలు తీరిన రాజకీయ నేతలను యశస్విని రెడ్డి భారీ మెజారిటీతో ఓడించి ప్రజల తీర్పు ఏంటో చూపించారని గుర్తుచేశారు. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని బావ-బావమరిది (కేటీఆర్, హరీశ్‌రావు) పదే పదే అడుగుతున్నారని... సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు పెడతామని మీతో పాటు కేసీఆర్‌ను కూడా సభకు తీసుకురావాలని రేవంత్ సవాల్ విసిరారు.



# జార్ఖండ్ ప్రభుత్వంపై విద్యార్థుల ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి

ముట్టడిస్తామని ప్రకటించారు. నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థులు గత 22 రోజులుగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాంచిలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు.

జేపీఎస్సీ-జేఎస్ఎస్సీ రిఫార్మ్ మంచ్ నాయకుడు రవీంద్ర పాశ్వాన్ మాట్లాడుతూ ఆగస్టు 20న ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని తెలిపారు. జేఎంఎం, కాంగ్రెస్ పార్టీలు విద్యార్థుల సమస్యలపై రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి తమ డిమాండ్లను పట్టించుకోకపోతే జేఎంఎం నేతృత్వంలోని ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు కొనసాగించకూడదని రాహుల్ గాంధీని కోరారు. నియామక పరీక్షల నిర్వహణలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వివాదాస్పదంగా మారిన పరీక్షలను రద్దు చేసి పారదర్శకంగా కొత్త పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపిస్తున్నారు.

ఆదివారం రాష్ట్రంలోని 24 జిల్లాల్లో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మలను దహనం చేస్తామని నిరసనకారులు ప్రకటించారు. తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పరీక్షల రద్దు, నియామక ప్రక్రియపై స్వతంత్ర విచారణ, బాధ్యులపై చర్యలు వంటి డిమాండ్లను ప్రభుత్వం అమలు చేసే వరకు ఆందోళనలు కొనసాగుతాయని విద్యార్థి సంఘాలు స్పష్టం చేశాయి. ఈ అంశం జార్ఖండ్ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది.

# కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా టిమ్స్

మొదటి పేజీ తరువాయి

6 మైనర్ ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయి. డయాగ్నస్టిక్స్ విభాగంలో 17 పాథాలజీ ల్యాబ్‌లు, 12 మైక్రోబయాలజీ ల్యాబ్‌లు, 10 బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లు, ఐదు ప్రత్యేక ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. బ్లాక్-ఏలో అత్యవసర సేవలు, 15 ఆపరేషన్ థియేటర్లు, 30 ఐసీయూ పడకలు, సెంట్రల్ స్టెరైల్ సర్వీస్ విభాగం ఉన్నాయి. బ్లాక్-బీలో ఓపీ రిజిస్ట్రేషన్, సెంట్రల్ ఫార్మసీ, కార్డియాక్ ఆపరేషన్ థియేటర్, న్యూక్లియర్ మెడిసిన్ విభాగం, రెండు క్యాథ్‌ల్యాబ్‌లు ఉన్నాయి. బ్లాక్-సీలో రేడియాలజీ, పాథాలజీ ల్యాబ్‌లు, సాధారణ, ప్రైవేట్ వార్డులు, వీఐపీ సూట్లు ఏర్పాటు చేశారు. బ్లాక్-డీలో పరిపాలన, విద్యా విభాగాలతో పాటు 200 మంది కూర్చునే ఆడిటోరియం ఉంది.

### 1-2 నిమిషాల్లోనే నమూనాల తరలింపు

టిమ్స్‌లో ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో దేశంలోనే తొలిసారిగా ఈ తరహా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సీల్డ్ ట్యూబ్‌లు, గాలి ఒత్తిడి ద్వారా రక్త నమూనాలు, మందులు, వైద్య నివేదికలు, అత్యవసర వస్తువులను వార్డులు, ల్యాబ్‌లు, ఫార్మసీ, బ్లడ్ బ్యాంక్‌ల మధ్య కేవలం 1-2 నిమిషాల్లో తరలించవచ్చు. దీంతో పరీక్షల కోసం పట్టే సమయం తగ్గడంతో పాటు నమూనాలు కలుషితం అయ్యే ప్రమాదం కూడా తగ్గనుంది.

### ఆరు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు

అవయవ మార్పిడి, కార్డియాక్ సైన్సెస్, ఆంకాలజీ, న్యూరోసైన్సెస్, నెఫ్రాలజీ, ట్రామా కేర్ విభాగాల్లో టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేశారు. కిడ్నీ, కాలేయం, గుండె, బహుళ అవయవ మార్పిడి సేవలకు అవకాశం కల్పించారు. ఆధునిక కార్డియోథొరాసిక్ శస్త్రచికిత్సలు, లీనాక్ ఆధారిత రేడియోథెరపీ, 24 గంటల అత్యవసర వైద్య సేవలు, ఐసీయూ సదుపాయాలతో 30 క్లినికల్ విభాగాలు అందుబాటులో ఉండనున్నాయి. ఆస్పత్రిలో 3.0 టెస్లా ఎంఆర్ఐ, 128 స్లైస్ సీటీ స్కానర్, అధునాతన మామోగ్రఫీ యూనిట్, ఐదు ఎక్స్‌రే యంత్రాలు ఏర్పాటు చేశారు. రోగులతో వచ్చే సహాయకుల కోసం జీ ప్లస్ 5 అంతస్తుల్లో నిర్మించిన ధర్మశాలలో 200 మందికి వసతి కల్పించే సదుపాయం ఉంది. 30 మృతదేహాల సామర్థ్యంతో మార్చురీ, కేంద్ర వంటశాల, లాండ్రీ, వైద్య వాయు పైప్‌లైన్ వ్యవస్థలకు ప్రత్యేక బ్లాకులు నిర్మించారు. టిమ్స్ నిర్మాణంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆస్పత్రిలో 75 శాతం నీటి పొదుపు సాధించేలా వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ఎస్టీపీ, ఈటీపీలు ఏర్పాటు చేసి



మురుగునీరు, వ్యర్థ ద్రవాలను శుద్ధి చేయనున్నారు. వర్షపు నీటిని సేకరించి మొక్కలు, గ్రీన్ కారిడార్లకు వినియోగించే విధానాన్ని అమలు చేయనున్నారు. పర్యావరణహిత నిర్మాణం, ఇంధన సామర్థ్య వ్యవస్థల కారణంగా ప్రాజెక్టుకు ఐజీబీసీ గోల్డ్ రేటింగ్ లభించింది. సామాన్య ప్రజలకు ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల్లో లభించే స్థాయి అత్యాధునిక వైద్య సేవలను ప్రభుత్వ వ్యవస్థలోనే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యానికి టిమ్స్ సనత్‌నగర్ ప్రతీకగా నిలవనుంది. భారీ పడకల సామర్థ్యం, అత్యాధునిక వైద్య పరికరాలు, సూపర్ స్పెషాలిటీ విభాగాలు, వేగవంతమైన నిర్ధారణ వ్యవస్థలు, పర్యావరణహిత సదుపాయాలతో ప్రభుత్వ వైద్యరంగంలో టిమ్స్ సనత్‌నగర్ కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది.

# శ్వేత సంపాదకీయం

**సోమవారం 17-8-2026**

## సరిహద్దు భద్రత.. ఆధునిక సాంకేతికత పాత్ర

ఒక దేశ సార్వభౌమాధికారాన్ని, భౌగోళిక సమగ్రతను కాపాడడంలో సరిహద్దు భద్రత అత్యంత కీలకమైన అంశం. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న భద్రతా పరిస్థితులు, ఉగ్రవాదం, అక్రమ చొరబాట్లు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ దాడులు వంటి సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో సంప్రదాయ భద్రతా వ్యవస్థలు మాత్రమే సరిపోవడం లేదు. ఈ పరిస్థితుల్లో ఆధునిక సాంకేతికత సరిహద్దుల రక్షణలో కీలక ఆయుధంగా మారుతోంది. సైనికుల అప్రమత్తతకు సాంకేతికత తోడైతే భద్రత మరింత పటిష్టమవుతుందని ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయి. భారత్ వంటి విశాల భూభాగం కలిగిన దేశానికి వేల కిలోమీటర్ల పొడవైన భూ, సముద్ర సరిహద్దులు ఉన్నాయి. పర్వతాలు, అటవీ ప్రాంతాలు, ఎడారులు, మంచు ప్రాంతాలు వంటి క్లిష్ట భౌగోళిక పరిస్థితుల్లో సరిహద్దు భద్రతను నిర్వహించడం సవాలుతో కూడుకున్న పని. ఇలాంటి ప్రాంతాల్లో ప్రతి కదలికను గమనించడం మానవ వనరులతో మాత్రమే సాధ్యం కాదు. అందుకే నిఘా వ్యవస్థల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం రోజురోజుకు పెరుగుతోంది.

డ్రోన్లు సరిహద్దు భద్రతలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయి. గతంలో సైనికులు గంటల తరబడి గస్తీ నిర్వహించాల్సి వచ్చేది. ఇప్పుడు డ్రోన్ల సహాయంతో విస్తారమైన ప్రాంతాలను తక్కువ సమయంలో పరిశీలించగలుగుతున్నారు. అనుమానాస్పద కదలికలను వెంటనే గుర్తించి భద్రతా బలగాలకు సమాచారాన్ని అందించడం ద్వారా డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో లేదా క్లిష్ట ప్రాంతాల్లో వీటి ఉపయోగం మరింత ప్రభావవంతంగా ఉంటుంది. ఉపగ్రహ సాంకేతికత కూడా సరిహద్దు రక్షణలో ప్రధాన సాధనంగా మారింది. అత్యాధునిక ఉపగ్రహాల ద్వారా భూభాగంలోని మార్పులు, అనుమానాస్పద కార్యకలాపాలు, నిర్మాణాలు వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించవచ్చు. ఉపగ్రహ చిత్రాల విశ్లేషణ ద్వారా ముందస్తు హెచ్చరికలు పొందడం సాధ్యమవుతోంది. ఇది వ్యూహాత్మక నిర్ణయాల తీసుకోవడంలో రక్షణ సంస్థలకు ఎంతో ఉపయోగపడుతోంది.

కృత్రిమ మేధ, యంత్ర అభ్యాసం వంటి సాంకేతికతలు భద్రతా రంగంలో కొత్త అవకాశాలను తెరుస్తున్నాయి. సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే భారీ సమాచారాన్ని విశ్లేషించి అనుమానాస్పద నమూనాలను గుర్తించే సామర్థ్యం వీటికి ఉంది. మానవ కంటికి కనిపించని కొన్ని సంకేతాలను కూడా ఈ వ్యవస్థలు గుర్తించగలుగుతున్నాయి. ఫలితంగా ప్రమాదాలను ముందుగానే అంచనా వేసే అవకాశం లభిస్తోంది. సెన్సార్ ఆధారిత నిఘా వ్యవస్థలు కూడా భద్రతను బలోపేతం చేస్తున్నాయి. భూమిపై, కంచెల వెంట, వ్యూహాత్మక ప్రాంతాల్లో ఏర్పాటు చేసే సెన్సార్లు కదలికలను గుర్తించి వెంటనే హెచ్చరికలు జారీ చేస్తాయి. చీకటి, పొగమంచు, వర్షం వంటి పరిస్థితుల్లో కూడా ఈ పరికరాలు సమర్థంగా పనిచేస్తాయి. దీంతో అక్రమ చొరబాట్లను అడ్డుకోవడం మరింత సులభమవుతోంది. సముద్ర సరిహద్దుల భద్రతలో కూడా ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోంది. రాడార్ వ్యవస్థలు, తీర ప్రాంత నిఘా కేంద్రాలు, ఉపగ్రహ ఆధారిత పర్యవేక్షణ ద్వారా అనుమానాస్పద పడవలు లేదా నౌకల కదలికలను గుర్తించవచ్చు. సముద్ర మార్గాల ద్వారా జరిగే అక్రమ రవాణాను నియంత్రించడంలో ఈ సాంకేతికతలు ఉపయోగపడుతున్నాయి. దేశ ఆర్థిక భద్రతకు కూడా ఇవి పరోక్షంగా మద్దతు ఇస్తున్నాయి.

అయితే సాంకేతికత ఒక్కటే అన్ని సమస్యలకు పరిష్కారం కాదు. ఆధునిక పరికరాలను సమర్థంగా వినియోగించగల శిక్షణ పొందిన సిబ్బంది అవసరం. అలాగే పరికరాల నిర్వహణ, నవీకరణ, సైబర్ భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సాంకేతికతను ఉపయోగించే వ్యవస్థలే సైబర్ దాడులకు గురైతే భద్రతా వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉంటుంది. భవిష్యత్తులో సరిహద్దు భద్రత మరింత సాంకేతిక ఆధారితంగా మారే అవకాశం ఉంది. స్వయంచాలక నిఘా వ్యవస్థలు, అధునాతన రోబోలు, మరింత సామర్థ్యవంతమైన డ్రోన్లు, కృత్రిమ మేధ ఆధారిత విశ్లేషణ వ్యవస్థలు విస్తృతంగా వినియోగంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచ దేశాలు ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. భారత్ కూడా స్వదేశీ సాంకేతికత అభివృద్ధిపై దృష్టి సారించడం శుభపరిణామం.

దేశ భద్రత అనేది కేవలం సైనికుల బాధ్యత మాత్రమే కాదు. అది జాతీయ అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వం, ప్రజల ప్రశాంత జీవనానికి సంబంధించిన అంశం. సరిహద్దులను పటిష్టంగా కాపాడాలంటే ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించడంతో పాటు మానవ నైపుణ్యాలను కూడా సమన్వయం చేయాలి. సాంకేతికత మరియు మానవ అప్రమత్తత కలిసినప్పుడే దేశ సరిహద్దులు మరింత సురక్షితంగా మారతాయి. అదే నేటి ప్రపంచ భద్రతా వాస్తవం, రేపటి అవసరం కూడా.

## ట్రంప్ పోస్టు.. కొరియాలో ఉద్రిక్తతలు

**కిమ్‌తో పాత ఫొటో పంచుకున్న ట్రంప్**

**సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా ఆగ్రహం**

**ద్వీపకల్పంలో మళ్లీ యుద్ధ మేఘాలు**



వాషింగ్టన్, ఆగస్టు 16 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ మధ్య ఉన్న సంబంధాలు మరోసారి అంతర్జాతీయ చర్చకు దారితీశాయి. ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్ సోషల్'లో కిమ్‌తో కలిసి దిగిన పాత ఫొటోను పంచుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఫొటోలో తాము గంభీరంగా కనిపిస్తున్నప్పటికీ, నవ్వుతూ దిగిన చిత్రాలు కూడా చాలా ఉన్నాయని పేర్కొన్నారు. కిమ్ జాంగ్ ఉన్‌తో తాను చాలా బాగా కలిసిపోతానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. గతంలో అమెరికా–ఉత్తర కొరియా సంబంధాల మెరుగుదలకు ఇద్దరు నేతలు పలుమార్లు సమావేశమయ్యారు. సింగపూర్, హనోయ్ సమావేశాల సమయంలో ట్రంప్, కిమ్ మధ్య వ్యక్తిగత అనుబంధం అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రత్యేక చర్చకు దారితీసింది. ఇప్పుడు ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు ఆ జ్ఞాపకాలను మళ్లీ తెరపైకి తీసుకొచ్చాయి.

అయితే ట్రంప్ ఈ పోస్టు చేసిన సమయంలో కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా, దక్షిణ కొరియా సంయుక్తంగా నిర్వహించనున్న 'ఉల్చీ ఫ్రీడమ్ షీల్డ్' సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఆగస్టు 17 నుంచి 27 వరకు జరగనున్న ఈ విన్యాసాల్లో డ్రోన్ల దాడులను ఎదుర్కోవడం, జీపీఎస్ అంతరాయాలను అధిగమించడం, సైబర్ యుద్ధ వ్యూహాలు వంటి ఆధునిక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విన్యాసాలపై స్పందించిన ఉత్తర కొరియా విదేశాంగ శాఖ అమెరికా, జపాన్, దక్షిణ కొరియా మధ్య పెరుగుతున్న సైనిక సహకారాన్ని 'అణు కూటమి'గా అభివర్ణించింది. తమపై పెరుగుతున్న భద్రతా ముప్పులకు తగిన స్థాయిలో ప్రతిస్పందిస్తామని హెచ్చరించింది. అధికారిక వార్తా సంస్థ ద్వారా విడుదల చేసిన ప్రకటనలో కొత్త స్థాయి ముప్పులను కొత్త స్థాయి నిరోధక శక్తితో ఎదుర్కొంటామని స్పష్టం చేసింది.

గత ఐదేళ్లలో జరిగిన విన్యాసాల కంటే ఈసారి నిర్వహిస్తున్న కార్యక్రమాలు భిన్నంగా ఉన్నాయని, ఆధునిక యుద్ధ నైపుణ్యాలను పెంపొందించడమే వాటి లక్ష్యమని ప్యాంగ్యాంగ్ ఆరోపించింది. తమ భద్రతకు ఎలాంటి ప్రమాదం ఏర్పడినా ప్రతిస్పందించడం తమ ప్రాథమిక విధానమని వెల్లడించింది. దీంతో ప్రాంతీయ భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల మధ్య ఆగస్టు 12న ఉత్తర కొరియా ఒక బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించడం అంతర్జాతీయంగా ఆందోళన కలిగించింది. ఒకవైపు ట్రంప్ కిమ్‌తో తన స్నేహపూర్వక సంబంధాలను గుర్తుచేసుకుంటుండగా, మరోవైపు కొరియా ద్వీపకల్పంలో సైనిక ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితులు భవిష్యత్‌లో ప్రాంతీయ రాజకీయాలు, భద్రతా సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## అమర జవాన్ అశోక్ కుమార్ రాజక్‌కు ఘన నివాళి

**గయాలో విగ్రహావిష్కరణ కార్యక్రమం**

**విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన సీఐఎస్ఎఫ్ జవాన్**

**ధైర్యసాహసాలకు చిరస్మరణీయ గౌరవం**

గయా, ఆగస్టు 16 : విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన సీఐఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ అశోక్ కుమార్ రాజక్ స్మారకార్థం బిహార్ రాష్ట్రంలోని గయా జిల్లా మన్‌పూర్ ఉన్నత పాఠశాలలో ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి అమర జవాన్ సేవలను స్మరించుకున్నారు. సీఐఎస్ఎఫ్, భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అశోక్ కుమార్ రాజక్ సీఐఎస్ఎఫ్ దోయాంగ్ జలవిద్యుత్ ప్రాజెక్టు విభాగంలో విధులు నిర్వహించారు. 1995 డిసెంబర్ 2న నాగాలాండ్ అడవుల గుండా సీఐఎస్ఎఫ్ కాన్వాయ్‌కు భద్రత కల్పిస్తున్న సమయంలో ఎన్ఎస్‌సీఎన్ మిలిటెంట్లు దాడికి పాల్పడ్డారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిన ఆయన విధి నిర్వహణలోనే వీరమరణం పొందారు.

మన్‌పూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి వజీర్‌గంజ్ ఎమ్మెల్యే బీరేంద్ర సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గయా విమానాశ్రయ డైరెక్టర్ అవధేశ్ కుమార్, గయా ప్రాంత భద్రతాధికారి నరేశ్ జోషి తదితరులు పాల్గొన్నారు. సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది, పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు కూడా కార్యక్రమంలో భాగమయ్యారు. అశోక్ కుమార్ రాజక్ విగ్రహావిష్కరణ ద్వారా ఆయన త్యాగం, దేశభక్తి, అంకితభావాన్ని భావితరాలకు చాటిచెప్పే ప్రయత్నం చేసినట్లు అధికారులు తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ల సేవలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు.

కుటుంబ సభ్యులు కూడా కార్యక్రమంలో పాల్గొని అశోక్ కుమార్ రాజక్ సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన దేశం కోసం చేసిన త్యాగం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. విగ్రహావిష్కరణతో అమర జవాన్ జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలుపుకోవడంతో పాటు యువతలో దేశభక్తి భావాలను పెంపొందించే సందేశం వెళ్లిందని సీఐఎస్ఎఫ్ అధికారులు తెలిపారు. ఆయన ధైర్యసాహసాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.



## అమెరికాలో వరుస కాల్పులు.. ఒకరు మృతి

**కెంటకీ పార్కులో దుండగుల కాల్పులు**

**వర్జీనియా విశ్వవిద్యాలయంలో ఐదుగురికి గాయాలు**

**తుపాకీ నియంత్రణపై మళ్లీ చర్చ**

వాషింగ్టన్, ఆగస్టు 16 : అమెరికాలో గన్ కల్చర్ మరోసారి కలకలం రేపింది. శనివారం కెంటకీ, వర్జీనియా రాష్ట్రాల్లో జరిగిన రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో ఒకరు మరణించగా, చిన్నారులతో సహా తొమ్మిది మంది గాయపడ్డారు. వరుసగా చోటుచేసుకున్న ఈ ఘటనలు స్థానిక ప్రజల్లో భయాందోళనలకు కారణమయ్యాయి. కెంటకీ రాష్ట్రంలోని లెక్సింగ్‌టన్ నగరంలో ఉన్న చార్లెస్ యంగ్ పార్కులో శనివారం సాయంత్రం దుండగులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో నాలుగేళ్ల చిన్నారి, 14 ఏళ్ల బాలుడు, ఇద్దరు పెద్దలు ఉన్నట్లు లెక్సింగ్‌టన్ పోలీస్ చీఫ్ లారెన్స్ వెదర్స్ తెలిపారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించగా, వారి ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు వెల్లడించారు.

ఘటన అనంతరం లెక్సింగ్‌టన్ నగరంలోని డౌన్‌టౌన్ ప్రాంతంలో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే కాల్పులకు పాల్పడిన వారి వివరాలను పోలీసులు ఇంకా వెల్లడించలేదు. ఘటనకు దారితీసిన కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. మరోవైపు వర్జీనియా స్టేట్ యూనివర్సిటీలో శనివారం తెల్లవారుజామున కాల్పుల ఘటన చోటుచేసుకుంది. విశ్వవిద్యాలయానికి చెందిన ఓ నివాస భవనం వెలుపల జరిగిన ఈ ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు క్యాంపస్‌ను తాత్కాలికంగా లాక్‌డౌన్ చేసి భద్రతా చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

సోమవారం నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఘటన విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగించింది. క్యాంపస్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తున్నట్లు యూనివర్సిటీ అధికారులు వెల్లడించారు. కాల్పులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇటీవల జార్జియా రాష్ట్రంలోని ఓ ఉన్నత పాఠశాలలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు విద్యార్థులు గాయపడిన ఘటన మరువకముందే ఈ రెండు సంఘటనలు చోటుచేసుకోవడం అమెరికాలో తుపాకీ హింసపై మరోసారి చర్చకు దారితీసింది. విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో వరుసగా జరుగుతున్న కాల్పుల నేపథ్యంలో తుపాకీ నియంత్రణ చట్టాలను మరింత కఠినతరం చేయాలన్న డిమాండ్లు మళ్లీ బలపడుతున్నాయి.




# యువతే భారతదేశానికి అతిపెద్ద బలం: ఉపరాష్ట్రపతి

## ఎస్ఆర్ఎమ్ పట్టాభిషేకోత్సవంలో ప్రసంగం.. ప్రతిభతో దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపు

చెన్నై, ఆగస్టు 16 : భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ యువతే దేశానికి అతిపెద్ద బలమని పేర్కొన్నారు. భవిష్యత్తు కోసం సిద్ధం కావడమే కాకుండా భవిష్యత్తును మలిచే నాయకులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. చెన్నై సమీపంలోని చెంగల్పట్టు జిల్లా కట్టంకులత్తూరులో ఎస్ఆర్ఎమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ 22వ పట్టాభిషేకోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టాలు అందుకుంటున్న విద్యార్థులను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. భారతదేశం యొక్క గొప్ప శక్తి ప్రజలేనని, ముఖ్యంగా యువతలో అపారమైన సామర్థ్యం ఉందని అన్నారు. దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు.

"భవిష్యత్తు కోసం మాత్రమే మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోవద్దు.. భవిష్యత్తును మలిచే స్థాయికి ఎదగండి" అని విద్యార్థులకు సందేశమిచ్చారు. జ్ఞానం, నైపుణ్యాలు, విలువలను సమన్వయం చేసుకుంటూ సమాజానికి ఉపయోగపడే దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మహీంద్రా అండ్ మహీంద్రా సంస్థ ఆటోమోటివ్ విభాగం అధ్యక్షుడు ఆర్. వెలుస్వామికి ఉపరాష్ట్రపతి గౌరవ డిగ్రీ ప్రదానం చేశారు. పారిశ్రామిక రంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో తమిళనాడు, కేరళ రాష్ట్రాల గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, ఎస్ఆర్ఎమ్ విద్యాసంస్థల ఛాన్సలర్ టి.ఆర్. పారివేందర్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.





పట్టాభిషేకోత్సవం విద్యార్థుల జీవితంలో కీలక మైలురాయని పేర్కొన్న ఉపరాష్ట్రపతి, ప్రపంచ స్థాయి పోటీలో భారత యువత తమ ప్రతిభను నిరూపించగల సామర్థ్యం కలిగి ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని పట్టభద్రులకు సూచించారు.

# నల్ల పిల్లులపై అపోహలకు చెక్

**జంతు సంరక్షణపై అవగాహన పెంపే లక్ష్యం**

**మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సందేశం**

**ప్రతి జీవికి సమాన గౌరవం అవసరం**



డెస్క్, ఆగస్టు 16 : ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది ఆగస్టు 17న జాతీయ నల్ల పిల్లుల ప్రశంసా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. నల్ల రంగు పిల్లుల పట్ల సమాజంలో ఉన్న అపోహలు, మూఢనమ్మకాలను తొలగించి వాటి సంరక్షణకు ప్రాధాన్యం కల్పించడమే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. అనేక దేశాల్లో ఇప్పటికీ నల్ల పిల్లులను అశుభ సూచకంగా భావించే తప్పుడు అభిప్రాయాలు కొనసాగుతుండటంతో ఈ ప్రత్యేక దినం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు చేపడుతున్నారు. చరిత్రపరంగా కొన్ని ప్రాంతాల్లో నల్ల పిల్లులను దురదృష్టానికి సంకేతంగా ప్రచారం చేశారు. రాత్రి సమయంలో వాటి నలుపు రంగు కారణంగా భయాందోళనలు, అపోహలు ఏర్పడ్డాయి. కాలక్రమేణా ఇవి మూఢనమ్మకాలుగా మారి అనేక మంది నల్ల పిల్లులను పెంచుకోవడానికి వెనుకంజ వేయడానికి కారణమయ్యాయి. అయితే శాస్త్రీయంగా చూస్తే ఇతర పిల్లుల మాదిరిగానే ఇవి కూడా సాధారణ జీవులే. వాటి రంగు తప్ప ప్రత్యేకమైన తేడా ఏదీ ఉండదని జంతు నిపుణులు చెబుతున్నారు.

జంతు సంరక్షణ కేంద్రాల్లో నల్ల పిల్లులు ఎక్కువకాలం దత్తత పొందకుండా మిగిలిపోతున్నాయని పలు అధ్యయనాలు వెల్లడించాయి. ఇతర రంగుల పిల్లులతో పోలిస్తే వీటిని దత్తత తీసుకునే వారి సంఖ్య తక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితిని మార్చేందుకు జంతు సంక్షేమ సంస్థలు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ నల్ల పిల్లులను దత్తత తీసుకోవాలని ప్రజలను ప్రోత్సహిస్తున్నాయి. నల్ల పిల్లులు కూడా ప్రేమ, ఆప్యాయత, అనుబంధాన్ని అందించే పెంపుడు జంతువులేనని జంతు ప్రేమికులు చెబుతున్నారు. ఇంట్లో పెంచుకునే జంతువుల విషయంలో రంగు, రూపం కంటే వాటి ఆరోగ్యం, స్వభావం, సంరక్షణ ముఖ్యమని సూచిస్తున్నారు. నల్ల పిల్లులు తెలివితేటలు, చురుకుదనం, యజమానుల పట్ల విశ్వాసం వంటి లక్షణాల్లో ఇతర పిల్లులతో సమానంగానే ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ దినోత్సవం సందర్భంగా పలు దేశాల్లో అవగాహన సదస్సులు, దత్తత శిబిరాలు, సామాజిక మాధ్యమాల ప్రచారాలు నిర్వహిస్తారు. జంతు హక్కులు, సంక్షేమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి జీవికి సమాన గౌరవం ఇవ్వాలనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తారు. ముఖ్యంగా పిల్లల్లో జంతువుల పట్ల ప్రేమాభిమానాలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. జాతీయ నల్ల పిల్లుల ప్రశంసా దినోత్సవం కేవలం ఒక జంతువుకు సంబంధించిన రోజు మాత్రమే కాదు. మూఢనమ్మకాల కంటే మానవత్వం గొప్పదని గుర్తు చేసే సందర్భం కూడా. ప్రతి జీవికి జీవించే హక్కు ఉందని, రంగు లేదా రూపాన్ని బట్టి వివక్ష చూపకూడదని ఈ దినం సందేశం ఇస్తోంది. జంతువుల పట్ల కరుణ, సంరక్షణ, బాధ్యతతో వ్యవహరించడం ద్వారా మరింత మానవీయ సమాజ నిర్మాణానికి తోడ్పడవచ్చని జంతు సంక్షేమ సంస్థలు పేర్కొంటున్నాయి.



# సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక విప్లవకారుడు సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళులు**

**...జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

విజయవాడ: ఆగస్టు 16, 2026 స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక విప్లవకారుడు, రైతు--కార్మిక పక్షపాతి సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలను ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, గౌతు లచ్చన్న జీవితం ప్రజాసేవ, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి, సామాజిక న్యాయం, సమానత్వానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. 1921లోనే స్వాతంత్ర్య ఉద్యమంలో అడుగుపెట్టిన ఆయన ఉప్పు సత్యాగ్రహం నుంచి క్విట్ ఇండియా ఉద్యమం వరకు చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. శ్రీకాకుళం ప్రాంతంలో రైతులను సంఘటితం చేసి జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారని, అస్పృశ్యతా నిర్మూలన, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కల్పించారని పేర్కొన్నారు. రైతులు, కార్మికులు, కూలీలు, కల్లు గీత కార్మికులు, పేదలు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాడారని కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో బలంగా వినిపిస్తూ పదవులను ప్రజాసేవకు సాధనంగా భావించిన నాయకుడిగా లచ్చన్న గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, సేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని, వాటి సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొని సర్దార్ గౌతు లచ్చన్నకు ఘనంగా నివాళులర్పించారు.



# స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటే వేడుకలు

**ఆగస్టు 17న ఇండోనేషియా జాతీయ పండుగ**

**వలస పాలనకు ముగింపు పలికిన చారిత్రక ఘట్టం**

**దేశవ్యాప్తంగా ఘనంగా ఉత్సవాలు**

ప్రపంచంలోని అతిపెద్ద ద్వీప సముదాయ దేశమైన ఇండోనేషియా ప్రతి ఏడాది ఆగస్టు 17న తన స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటుంది. 1945 ఆగస్టు 17న ఇండోనేషియా స్వాతంత్ర్యాన్ని అధికారికంగా ప్రకటించడంతో దేశ చరిత్రలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విద్యాసంస్థలు, సామాజిక సంఘాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటాయి.

డెస్క్, ఆగస్టు 16 : ఇండోనేషియా శతాబ్దాల పాటు విదేశీ పాలనను ఎదుర్కొంది. ముఖ్యంగా డచ్ వలస పాలన దాదాపు మూడు శతాబ్దాలకుపైగా కొనసాగింది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్ ఆక్రమణ అనంతరం రాజకీయ పరిస్థితుల్లో వచ్చిన మార్పులు స్వాతంత్ర్య ఉద్యమానికి బలాన్ని చేకూర్చాయి. ఈ నేపథ్యంలో జాతీయ నాయకులు సుకార్నో, మహమ్మద్ హట్టా నాయకత్వంలో 1945 ఆగస్టు 17న ఇండోనేషియా స్వాతంత్ర్య ప్రకటన వెలువడింది. ఈ ప్రకటన దేశ ప్రజల్లో కొత్త ఆశలను నింపింది.

స్వాతంత్ర్య ప్రకటన చేసిన వెంటనే ఇండోనేషియా పూర్తిస్థాయి స్వేచ్ఛను పొందలేదు. డచ్ పాలకులు మళ్లీ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ప్రయత్నించడంతో పలు సంవత్సరాల పాటు పోరాటం సాగింది. అంతర్జాతీయ ఒత్తిడి, ప్రజల ఉద్యమాల ఫలితంగా చివరకు ఇండోనేషియా స్వతంత్ర దేశంగా ప్రపంచ గుర్తింపు పొందింది. ఈ పోరాటం దేశ ప్రజల ఐక్యత, త్యాగం, సంకల్పానికి నిదర్శనంగా నిలిచింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజధాని జకార్తాలో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తారు. జాతీయ పతాకావిష్కరణ, సైనిక పరేడ్‌లు, సాంస్కృతిక ప్రదర్శనలు, దేశభక్తి కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తాయి. అధ్యక్షుడు జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ దేశ అభివృద్ధి, భవిష్యత్ లక్ష్యాలపై సందేశం అందిస్తారు. వేలాది మంది ప్రజలు ఈ వేడుకల్లో పాల్గొని తమ దేశభక్తిని చాటుకుంటారు.

ఇండోనేషియాలో ఈ రోజు కేవలం అధికారిక కార్యక్రమాలకే పరిమితం కాదు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజలు వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక ఉత్సవాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి జాతీయ పండుగను ఆనందంగా జరుపుకుంటారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. స్వాతంత్ర్య దినోత్సవం ఇండోనేషియా ప్రజలకు తమ చరిత్రను గుర్తు చేయడంతో పాటు భవిష్యత్ అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు స్ఫూర్తినిస్తుంది. స్వేచ్ఛ కోసం పోరాడిన నాయకులు, సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ ఐక్యత, అభివృద్ధి, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలనే సంకల్పాన్ని పునరుద్ఘాటించే సందర్భంగా ఈ రోజు నిలుస్తోంది. 81 ఏళ్లకు పైగా స్వాతంత్ర్య ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ఇండోనేషియా, ప్రపంచ వేదికపై తన ప్రత్యేక స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ ముందుకు సాగుతోంది.







# ముద్రగడ కుటుంబాన్ని పరామర్శించిన నేతలు

**- చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి**
**- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి అండగా ఉంటామని భరోసా**

కాకినాడ, ఆగస్టు 16 : ప్రముఖ కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభం కుటుంబ సభ్యులను రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. ముద్రగడ నివాసానికి చేరుకున్న వారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన ఉద్యమాలు, ప్రజా సేవలను స్మరించుకున్నారు. సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.

ముద్రగడ పద్మనాభం ప్రజల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా గుర్తింపు పొందారని నేతలు అన్నారు. ఆయన రాజకీయ, సామాజిక సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ పరామర్శించారు.

ముద్రగడ కుటుంబానికి పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని, అవసరమైన ప్రతి సందర్భంలో అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ముద్రగడ పద్మనాభం సేవలను కొనియాడుతూ ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.



# అవిడి కుటుంబానికి ప్రభుత్వ అండ

**24 గంటల్లో విద్యుత్ కనెక్షన్.. రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణం**

**నిత్యావసరాలు, అదనపు సాయానికి చర్యలు**

కోత్తపేట, ఆగస్టు 16 : సోషల్ మీడియా ద్వారా అవిడి గ్రామానికి చెందిన గోటేటి రామమూర్తి కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం తక్షణమే స్పందించింది. మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగి ఆ కుటుంబానికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. అధికారులను అప్రమత్తం చేసి కేవలం 24 గంటల వ్యవధిలోనే కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ఆ కుటుంబానికి విద్యుత్ కనెక్షన్ అందజేశారు. చాలా కాలంగా ఎదురుచూస్తున్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే రూ.5 లక్షల వ్యయంతో పక్కా ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. రెండు నెలల్లో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. నివాస సౌకర్యం లేని పరిస్థితుల్లో జీవిస్తున్న కుటుంబానికి ఇది పెద్ద ఊరటనిచ్చే అంశంగా మారింది. తక్షణ సాయంగా వంటగ్యాస్, నిత్యావసర సరుకులు, ఫర్నిచర్‌ను అందజేశారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అదనపు పెన్షన్ మంజూరుకు కూడా చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. పేద కుటుం బాల కష్టాలను గుర్తించి వెంటనే స్పందించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని నాయ కులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇకపై గోటేటి రామమూర్తి కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజలు కూడా ప్రభుత్వ స్పందనను అభినందిస్తూ కుటుంబానికి మద్దతు తెలిపారు.

# ‘దిమాగీ నక్సల్’ వ్యాఖ్యలపై రాజకీయ దుమారం

## ప్రధాని వ్యాఖ్యలకు చిదంబరం కౌంటర్



న్యూఢిల్లీ, ఆగస్టు 16 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ‘దిమాగీ నక్సలిజం’ వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి చేసిన ప్రసంగంలో ప్రధాని ఈ పదాన్ని ఉపయోగించడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం స్పందిస్తూ తాను “గర్వపడే దిమాగీ నక్సల్‌ను” అంటూ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ దేశంలో సాయుధ నక్సలిజాన్ని గణనీయంగా బలహీనపరిచినప్పటికీ, ‘దిమాగీ నక్సలిజం’ రూపంలో మరో సవాల్ ఎదురవుతోందని పేర్కొన్నారు. హింస, అశాంతిని ప్రోత్సహించే ఆలోచనలను వ్యాప్తి చేసే వ్యక్తులను గుర్తించి సమాజం అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. యువతను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని కూడా తెలిపారు. ప్రధాని వ్యాఖ్యల అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు వరుసగా స్పందించారు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని రెచ్చగొట్టే పదజాలాన్ని ఉపయోగించడం సరికాదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే వారిని ఇలాంటి ముద్రలతో చిత్రీకరించడం అనుచితమని కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడ్డారు. పి. చిదంబరం తన ఎక్స్ పోస్టులో “నేను గర్వపడే దిమాగీ నక్సల్‌ను” అని పేర్కొంటూ ప్రధాని వ్యాఖ్యలకు వ్యంగ్యంగా సమాధానమిచ్చారు. ఈ వ్యాఖ్య సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారితీసింది. అధికార, ప్రతిపక్ష వర్గాల మధ్య పదునైన వాదోపవాదాలకు కారణమైంది.

# టీఎంసీ కార్యాలయంలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఆత్మహత్య

**పార్టీ కార్యాలయంలో విషాద ఘటన**

**సూసైడ్ లేఖలో అవినీతి ఆరోపణల ప్రస్తావన**

**రాజకీయాల్లోకి రావడమే తప్పు అన్న ఆశిష్**

రాంపూర్హత్, ఆగస్టు 16 : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్, టీఎంసీ సీనియర్ నేత డా. ఆశిష్ బెనర్జీ (74) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆదివారం ఉదయం బిర్భూమ్ జిల్లాలోని రాంపూర్హత్ పట్టణంలో తన నివాసానికి సమీపంలో ఉన్న టీఎంసీ పార్టీ కార్యాలయంలో ఆయన మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటన స్థలం నుంచి ఒక సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. సూసైడ్ లేఖలో ఆశిష్ బెనర్జీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు. తాను ఎప్పుడూ అవినీతికి పాల్పడలేదని, రాజకీయాల్లోకి రావడమే తన జీవితంలో చేసిన పెద్ద తప్పు అని పేర్కొన్నారు. తన మరణానికి ఎవరూ బాధ్యులు కాదని స్పష్టంగా రాశారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో కొనసాగుతున్నప్పటికీ ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని లేఖలో వివరించారు.

ఇటీవల తారాపీఠ్--రాంపూర్హత్ అభివృద్ధి ప్రాధికార సంస్థకు సంబంధించిన టెండర్లు, చెక్కులు, అనుమతి పత్రాల వ్యవహారాల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణల్లో ఆశిష్ బెనర్జీ పేరును కూడా ప్రస్తావిస్తూ విమర్శలు వెల్లువెత్తాయి. అయితే ఆ ఆరోపణలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, ఏ



పనికీ డబ్బు డిమాండ్ చేయలేదని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. పార్టీలో తప్పులను తాను ఎప్పుడూ ప్రోత్సహించలేదని, అదే సమయంలో అక్రమాలకు పాల్పడుతున్న వారిని ఎదుర్కొనే పరిస్థితిలో కూడా లేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశిష్ బెనర్జీ పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ప్రముఖ నాయకుడిగా గుర్తింపు పొందారు. బిర్భూమ్ జిల్లాలోని రాంపూర్హత్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2001 నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దాదాపు 25 సంవత్సరాల పాటు అసెంబ్లీలో ప్రజలకు ప్రాతినిధ్యం వహించారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా సేవలందించడంతో పాటు మమతా బెనర్జీ మంత్రివర్గంలో మంత్రిగా కూడా పనిచేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు.

ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. సూసైడ్ నోట్‌లో పేర్కొన్న అంశాలను కూడా పరిశీలిస్తున్నారు. రాజకీయ వర్గాల్లో ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆశిష్ బెనర్జీ మరణం పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో విషాదాన్ని మిగిల్చింది.



# రక్షణ ఎగుమతులకు కేంద్రం ప్రోత్సాహం

**రెండు సంస్థలకు నాణ్యత ధ్రువపత్రాలు**

**స్వావలంబన భారత్ లక్ష్యానికి బలం**

న్యూఢిల్లీ, ఆగస్టు 16 : దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీ, ఎగుమతులను ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రక్షణ ఎగుమతుల ప్రోత్సాహక పథకం కింద రెండు భారతీయ సంస్థలకు ప్రత్యేక నాణ్యత ధ్రువపత్రాలను అందజేసింది. ఈ చర్యతో దేశ రక్షణ ఎగుమతుల వ్యవస్థకు మరింత బలం చేకూరనుం దని అధికారులు పేర్కొన్నారు. రక్షణ నాణ్యత హామీ విభాగం డైరెక్టర్ జనరల్ ఎన్. మనోహరన్ ఆగస్టు 13న న్యూఢి ల్లీలోని ప్రధాన కార్యాలయంలో నిర్వ హించిన కార్యక్రమంలో ఈ ధ్రువ పత్రాలను అందజేశారు. హిసార్‌కు చెందిన జిందాల్ డిఫెన్స్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 9ఐ19 మిల్లీమీటర్ల పిస్టల్ టీఎస్--9కు సంబంధించి ‘వెండర్ నిర్దేశాలకు అనుగుణం’ ధ్రువపత్రం అందించారు. అదే విధంగా కాన్పూర్‌కు చెందిన పీఎల్ఆర్ సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్‌కు నాలుగు రక్షణ ఉత్పత్తులకు సంబంధించిన ధ్రువపత్రాలు జారీ చేశారు. ఈ గుర్తింపు ద్వారా ఆయా ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత విశ్వసనీయతను పొందనున్నాయి. రక్షణ ఉత్పత్తుల నాణ్యతను ధ్రువీకరించడం ద్వారా విదేశీ కొనుగోలుదారుల్లో నమ్మకం పెరుగుతుందని అధికారులు తెలిపారు. దీంతో భారతీయ సంస్థలకు కొత్త ఎగుమతి అవకాశాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారత దేశం రక్షణ రంగంలో స్వదేశీ తయారీ పై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ‘మేక్ ఇన్ ఇండియా’, ‘ఆత్మనిర్భర్ భారత్’ కార్యక్ర మాల ద్వారా దేశీయ సంస్థలను ప్రోత్స హిస్తూ రక్షణ రంగంలో స్వావలంబన సాధించేందుకు కృషి చేస్తోంది. రక్షణ ఎగుమతుల విస్తరణ ద్వారా అంతర్జాతీయ మార్కెట్లో భారతదేశ స్థాయిని మరింత పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోంది.

# డీఎస్సీపై సీబీఐ విచారణ డిమాండ్

**ఉపాధ్యాయుల సస్పెన్షన్లపై విమర్శలు**

**ప్రభుత్వంపై ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి ఆరోపణలు**



నెల్లూరు, ఆగస్టు 16 : డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై వెంటనే సీబీఐ విచారణ జరిపించాలని ఎమ్మెల్సీ పి. చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలను, ఉద్యోగులను, ఉపాధ్యాయులను ప్రశ్నిస్తే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. డీఎస్సీ అక్రమాల వల్ల వేలాది మంది అభ్యర్థులు నష్టపోయారని, వారి తరఫున వైఎస్సార్సీపీ పోరాడుతోందన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీకి సంబంధించిన ఆధారాలు బయటకు వచ్చాయని, ఒక్కో ఉద్యోగాన్ని లక్షల రూపాయలకు విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు అవసరమని అన్నారు. అర్హతలు లేని వారికి ఉద్యోగాలు కల్పించేందుకు కొన్ని జీవోలను ప్రభుత్వం తీసుకొచ్చిందని, విమర్శలు రావడంతో వాటిని వెనక్కి తీసుకుందని చంద్రశేఖర్ రెడ్డి ఆరోపించారు. డీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ప్రతిపక్ష నాయకులపై కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రిని కలిసి తమ సమస్యలు వివరించిన ఉపాధ్యాయులను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సస్పెండ్ చేయడం అన్యాయమని అన్నారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనేలా చేస్తున్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని చెప్పారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఐఆర్, డీఏ బకాయిలు, పీఆర్సీ అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యోగులకు రావాల్సిన వేల కోట్ల రూపాయల బకాయిలు ఇంకా చెల్లించలేదని ఆరోపించారు. ఉపాధ్యాయులకు టెట్ నిబంధనను వెనుకబడిన కాలానికి వర్తింపజేయడం సరికాదన్నారు. డీఎస్సీ, గ్రూప్-1 నియామకాలపై సమగ్ర సీబీఐ విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.

# పరకాలలో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం

### వందల కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన
### ఆసుపత్రి, కళాశాల భవనాల ప్రారంభం
### పరకాల అభివృద్ధికి కొత్త దిశ
### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**పరకాల, ఆగస్టు 16 :**

హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గంలో అభివృద్ధికి కొత్త ఊపునిస్తూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదివారం భారీ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. విద్య, వైద్యం, రహదారులు, విద్యుత్, మహిళా సాధికారత, పట్టణాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాలకు సంబంధించిన వందల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతో పాటు ఇప్పటికే పూర్తయిన పలు నిర్మాణాలను ప్రజలకు అంకితం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా రూ.200 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అత్యాధునిక వసతులతో నిర్మించనున్న ఈ విద్యాసంస్థ ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రానుంది. అలాగే రూ.82 కోట్ల వ్యయంతో పరకాల మున్సిపాలిటీలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు కూడా శ్రీకారం చుట్టారు. డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యాల మెరుగుదలతో పట్టణ రూపురేఖలు మారనున్నాయని అధికారులు తెలిపారు.

పరకాల నుంచి ఎర్రగట్టుగుట్ట వరకు రూ.65 కోట్లతో నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ రహదారి పూర్తయితే రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు వాణిజ్య కార్యకలాపాలకు ఊతం లభించనుంది. అదేవిధంగా రూ.45.15 కోట్లతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టారు. యువతకు ఆధునిక సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ అందించే కేంద్రంగా ఇది అభివృద్ధి చెందనుంది. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యం ఇస్తూ దామెర మండలం ల్యాదెళ్లలో రూ.32.17 కోట్ల అంచనా వ్యయంతో పరకాల ఇందిరా మహిళా డెయిరీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మంది మహిళలకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అక్కంపేట గ్రామంలో రూ.10 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు, శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి రూ.5 కోట్లతో చేపట్టనున్న కార్యక్రమాలకు కూడా ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.

ఆత్మకూర్ ప్రాంతంలో టౌన్‌షిప్ అండర్ ల్యాండ్ పూలింగ్ పథకానికి శంకుస్థాపన చేయడం మరో ముఖ్య ఘట్టంగా నిలిచింది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పట్టణ విస్తరణ చేపట్టేందుకు ఈ పథకం దోహదపడనుంది. అలాగే పరకాలలో రూ.3 కోట్ల వ్యయంతో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, రూ.1.10 కోట్లతో విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయ నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టారు. వీటి ద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ఇప్పటికే పూర్తయిన పలు నిర్మాణాలను కూడా ముఖ్యమంత్రి ప్రజలకు అంకితం చేశారు. పరకాలలో రూ.35 కోట్లతో నిర్మించిన 100 పడకల ఏరియా ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ ఆసుపత్రి ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఆత్మకూర్‌లో రూ.1 కోట్లతో నిర్మించిన ఆధునిక ప్రత్యేక కేంద్రాన్ని ప్రారంభించగా, పరకాలలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని కూడా ప్రారంభించారు. ఈ విద్యాసంస్థ ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు మరింత విస్తరించనున్నాయి.

ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో పరకాల నియోజకవర్గం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు, ఉపాధి రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బండ్ల గణేష్ కుమార్తె వివాహానికి హాజరైన సీఎం

### హైదరాబాద్‌లో ఘనంగా వివాహ వేడుక
### వధూవరులను ఆశీర్వదించిన రేవంత్
### సినీ, రాజకీయ ప్రముఖుల సందడి

**హైదరాబాద్, ఆగస్టు 16 :**

టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ కుమార్తె జనని వివాహ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. జనని--సూర్యతేజల వివాహానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుక నగరంలోని జేఆర్సీ కన్వెన్షన్ కేంద్రంలో వైభవంగా నిర్వహించారు. వివాహ కార్యక్రమానికి సినీ, రాజకీయ, వ్యాపార రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా వివాహ వేడుకకు హాజరై బండ్ల గణేష్ కుటుంబ సభ్యులను అభినందించారు. వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులతో ఆయన ముచ్చటించారు. బండ్ల గణేష్ తెలుగు సినీ పరిశ్రమలో నిర్మాతగా, నటుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన కుమార్తె జనని వివాహ వేడుకను కుటుంబ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహించారు. జనని, సూర్యతేజ నిశ్చితార్థం కూడా ఈ ఏడాది హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. వివాహ వేడుకకు హాజరైన అతిథుల సందడితో జేఆర్సీ కన్వెన్షన్ కేంద్రం కళకళలాడింది. వధూవరులకు ఆశీస్సులు అందించేందుకు సినీ, రాజకీయ ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# జనని వివాహంలో ప్రముఖుల సందడి

### ఘనంగా జరిగిన పెళ్లి వేడుక
### నూతన దంపతులను ఆశీర్వదించిన అతిథులు
### భావోద్వేగానికి గురైన బండ్ల గణేశ్
### హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**హైదరాబాద్, ఆగస్టు 16 :**

ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం ఆదివారం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యతేజతో జనని వివాహ బంధంలో అడుగుపెట్టారు. నగరంలోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ వేడుకకు రాజకీయ, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వివాహ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సతీమణి నారా భువనేశ్వరితో కలిసి విచ్చేశారు. నూతన వధూవరులను ఆశీర్వదించి అక్షింతలు వేశారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వరుడు సూర్యతేజ ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా భువనేశ్వరి చేతుల మీదుగా తాళిని స్వీకరించి వధువు జనని మెడలో మంగళసూత్రధారణ చేశారు. ఈ ఘట్టం వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తన కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి దంపతులు హాజరుకావడం పట్ల బండ్ల గణేశ్ భావోద్వేగానికి గురయ్యారు. ఆనందభాష్పాలు పెట్టుకున్న ఆయనను సినీ నటుడు బ్రహ్మాజీ ఓదార్చారు. ఈ దృశ్యం అక్కడున్న వారిని కదిలించింది. బండ్ల గణేశ్‌కు సినీ, రాజకీయ రంగాల్లో ఉన్న అనుబంధాల కారణంగా పలువురు ప్రముఖులు వేడుకకు హాజరయ్యారు. నాయకులు, నటీనటులు, నిర్మాతలు, వ్యాపారవేత్తలు నూతన దంపతులను ఆశీర్వదించారు. వివాహ ప్రాంగణం అతిథుల రాకతో సందడిగా మారింది. వివాహ వేడుకకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం పొందుతున్నాయి. నూతన దంపతులకు అభిమానులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.





## ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన సీపీ

### పరకాల పర్యటనలో మర్యాదపూర్వక భేటీ
### హెలికాప్టర్‌లో జూనియర్ కళాశాల మైదానానికి రాక

**పరకాల, ఆగస్టు 16 :**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరకాల పర్యటన సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం సాయంత్రం పరకాల జూనియర్ కళాశాల మైదానానికి హెలికాప్టర్‌లో చేరుకున్న ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ముఖ్యమంత్రికి మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సంక్షిప్తంగా వివరించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమ ప్రాంగణం పరిసరాల్లో బందోబస్తు నిర్వహించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. పర్యటనలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రాకతో పరకాల ప్రాంతంలో సందడి నెలకొంది. ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయని అధికారులు తెలిపారు. పర్యటన ప్రశాంతంగా ముగిసేలా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పలువురు అభినందించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా కొనసాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేశారు.

# పొదుపు అలవాటు కుటుంబ ఆర్థిక భద్రతకు పునాది

ప్రస్తుత కాలంలో సంపాదన పెరిగినప్పటికీ ఖర్చులు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. సాంకేతికత అభివృద్ధి, జీవనశైలిలో మార్పులు, వినియోగ సంస్కృతి విస్తరణతో ప్రజల ఖర్చు చేసే ధోరణి గణనీయంగా పెరిగింది. చాలా మంది నెలవారీ ఆదాయం మొత్తం ఖర్చు చేయడం వల్ల భవిష్యత్తు అవసరాల కోసం ప్రత్యేకంగా నిధులు నిల్వ చేయలేకపోతున్నారు. అయితే ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం సంపాదన ఎంత ఉన్నా అందులో కొంత భాగాన్ని పొదుపు చేయడం ప్రతి కుటుంబం పాటించాల్సిన ప్రాథమిక ఆర్థిక నియమం. చిన్న మొత్తంతో ప్రారంభమైన పొదుపు కాలక్రమేణా పెద్ద భరోసాగా మారి కుటుంబ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుతుంది. పొదుపు అనేది కేవలం డబ్బును దాచిపెట్టడం మాత్రమే కాదు. అది ఒక క్రమశిక్షణ, ఒక ఆర్థిక ప్రణాళిక. ఆదాయం వచ్చిన వెంటనే ఖర్చుల జాబితా తయారు చేసి, అవసరం లేని వ్యయాలను తగ్గించి, ముందుగా కొంత మొత్తాన్ని పొదుపుకు కేటాయించడం ఉత్తమమైన పద్ధతి. ఈ అలవాటు వల్ల వ్యక్తులు తమ ఆర్థిక పరిస్థితిని మెరుగ్గా అర్థం చేసుకోగలుగుతారు. అలాగే డబ్బు వినియోగంలో బాధ్యత పెరిగి అనవసర అప్పుల బారిన పడే అవకాశాలు తగ్గుతాయి.

జీవితంలో ఎప్పుడు ఏ అత్యవసర పరిస్థితి ఎదురవుతుందో ఎవరూ ఊహించలేరు. అనారోగ్యం, ప్రమాదాలు, ఉద్యోగ నష్టం, వ్యాపార నష్టాలు, ప్రకృతి విపత్తులు వంటి పరిస్థితులు ఒక్కసారిగా కుటుంబ ఆర్థిక పరిస్థితిని దెబ్బతీయవచ్చు. అలాంటి సందర్భాల్లో పొదుపు చేసిన నిధులు రక్షణ కవచంలా పనిచేస్తాయి. ఇతరుల వద్ద అప్పులు అడగాల్సిన అవసరాన్ని తగ్గించి ఆత్మవిశ్వాసంతో సమస్యలను ఎదుర్కొనే శక్తిని ఇస్తాయి. అందుకే ప్రతి కుటుంబానికి అత్యవసర నిధి తప్పనిసరిగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లల విద్య కోసం నేడు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. పాఠశాల ఫీజుల నుంచి ఉన్నత విద్య వరకు లక్షల రూపాయలు అవసరమవుతున్నాయి. ముందస్తుగా పొదుపు చేయడం ద్వారా పిల్లల చదువులకు అవసరమైన నిధులను సమకూర్చుకోవచ్చు. దీంతో విద్య కోసం చివరి నిమిషంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండటమే కాకుండా పిల్లలకు మంచి అవకాశాలు కల్పించేందుకు తల్లిదండ్రులకు వీలు కలుగుతుంది. విద్యపై పెట్టుబడి పెట్టడం కుటుంబ భవిష్యత్తును బలోపేతం చేసే అంశంగా భావించాలి.

కుటుంబంలో వివాహాలు, ఇల్లు నిర్మాణం, వాహన కొనుగోలు, వృద్ధాప్య జీవనం వంటి అనేక దీర్ఘకాలిక అవసరాలు ఉంటాయి. వీటి కోసం ఒక్కసారిగా పెద్ద మొత్తంలో డబ్బు సమకూర్చడం సాధ్యం కాదు. క్రమబద్ధమైన పొదుపు ద్వారా ఈ లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చు. ప్రతి నెల కొంత మొత్తాన్ని పక్కన పెట్టడం వల్ల సంవత్సరాల తరువాత పెద్ద నిధి ఏర్పడి కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుంది. ఇది ఆర్థిక ప్రణాళికలో అత్యంత కీలకమైన అంశంగా పరిగణించబడుతుంది. నేటి డిజిటల్ యుగంలో ఖర్చు చేయడం చాలా సులభమైంది. మొబైల్ చెల్లింపులు, ఆన్‌లైన్ కొనుగోళ్లు, వివిధ రకాల రుణ సదుపాయాలు అందుబాటులో ఉండటంతో అవసరం లేని వస్తువులను కూడా కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ఖర్చులపై నియంత్రణ లేకపోతే పొదుపు చేయడం కష్టమవుతుంది. అందువల్ల ఆదాయం, ఖర్చులపై నెలవారీ సమీక్ష నిర్వహించడం ప్రతి కుటుంబం అలవాటు చేసుకోవాలి.

పొదుపు అలవాటు కుటుంబ సభ్యులలో ఆర్థిక బాధ్యతను పెంపొందిస్తుంది. ముఖ్యంగా చిన్నారులకు చిన్న వయసులోనే డబ్బు విలువ, పొదుపు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పిస్తే వారు భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారు. పిగ్గీ బ్యాంకులు, చిన్న పొదుపు పథకాలు వంటి వాటి ద్వారా పిల్లల్లో పొదుపు సంస్కృతిని పెంపొందించవచ్చు. ఇది కుటుంబ స్థాయిలోనే కాకుండా సమాజ స్థాయిలో కూడా ఆర్థిక క్రమశిక్షణకు దోహదం చేస్తుంది. పొదుపు వ్యక్తిగత స్థాయిలోనే కాకుండా దేశ ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడుతుంది. ప్రజలు బ్యాంకులు, పొదుపు పథకాలలో పెట్టుబడులు పెట్టడం వల్ల ఆ నిధులు అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడతాయి. దీంతో పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అంటే వ్యక్తిగత పొదుపు దేశ ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేసే శక్తిగా మారుతుంది. వృద్ధాప్య జీవితం సుఖంగా ఉండాలంటే యువ వయసు నుంచే పొదుపు చేయడం అవసరం. ఉద్యోగ విరమణ తరువాత స్థిరమైన ఆదాయం లేకపోవచ్చు. అలాంటి సమయంలో ముందుగా కూడబెట్టుకున్న నిధులు ఆర్థిక భద్రతను అందిస్తాయి. ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించేందుకు అవకాశం కల్పిస్తాయి. అందువల్ల వృద్ధాప్య ప్రణాళికలో పొదుపు కీలక పాత్ర పోషిస్తుంది. మొత్తంగా చూస్తే పొదుపు అనేది కేవలం ఆర్థిక చర్య మాత్రమే కాదు, భవిష్యత్తును భద్రపరచే జీవన విధానం.

## గ్రామీణ క్రీడాకారులను ఒక్క తాటిపైకి తెచ్చే ప్రయత్నం

నారాయణగూడ : 'ఈశా గ్రామోత్సవం-2026' తెలంగాణ ఎడిషన్ ముగింపు వేడుకలు ఆదివారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈశా యోగ కేంద్రం సమన్వయకర్త స్వామి అంబర, ప్రతినిధులు జలజ, ఉమ, జయలక్ష్మి తదితరులు వివరాలు వెల్లడించారు. గ్రామీణ క్రీడాకారులను ఒక్కతాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నమే గ్రామోత్సవమని చెప్పారు. "రాష్ట్రవ్యాప్తంగా 15 జిల్లాల్లోని 25 ప్రాంతాల నుంచి 9,600 మందికిపైగా గ్రామీణ క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. 600 పురుషుల వాలీబాల్ జట్లు, 243 మహిళల త్రోబాల్ జట్లు తమ ప్రతిభను చాటాయి. ఆదివారం మహిళల త్రోబాల్, పురుషుల వాలీబాల్ రాష్ట్రస్థాయి ఫైనల్ పోటీలు జరిగాయి. ఇందులో మహిళల త్రోబాల్ పోటీలో కోయచల్క గ్రామానికి చెందిన 'కోయచల్క వారియర్స్' జట్టు రాష్ట్రస్థాయి ఛాంపియన్‌గా నిలిచింది. పురుషుల వాలీబాల్ పోటీలో రంగారెడ్డి జిల్లాకు చెందిన 'దేవుని పడకల్' జట్టు రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. 84 ఏళ్ల నరసమ్మ, 83 ఏళ్ల కోటమ్మలు 'ఈశా గ్రామోత్సవం'లో అత్యంత పెద్ద వయస్కులుగా పాల్గొని స్ఫూర్తిగా నిలిచారు. ఇక్కడ ప్రతిభను చాటిన జట్లు సెప్టెంబరు 4, 6 తేదీల్లో కోయంబత్తూరులోని 'ఈశా యోగా కేంద్రం'లో జరగనున్న 'గ్రాండ్ ఫినాలే'లో పోటీపడతాయి. విజేతలకు ఒకొక్కరికీ రూ.5 లక్షలు, రన్నరప్‌లకు రూ.3 లక్షలు, మూడో, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.లక్ష, రూ.50 వేల చొప్పున అందజేస్తారు.




# 'మహేంద్రగిరి వారాహి'లో 'బ్రహ్మ'గా బ్రహ్మానందం

దశాబ్దాలుగా తన హాస్యంతో తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్న లెజెండరీ నటుడు బ్రహ్మానందం, ఇప్పుడు ఓ సరికొత్త అవతారంలో కనిపించబోతున్నారు. ఆయన తన ఇమేజ్‌కు పూర్తి భిన్నమైన, సీరియస్ పాత్రతో ప్రేక్షకులను ఆశ్చర్యపరచనున్నారు. సుమంత్ ప్రధాన పాత్రలో, సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మైథలాజికల్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి'లో బ్రహ్మానందం ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన పాత్ర పేరు 'బ్రహ్మ'. దీనికి సంబంధించి చిత్రబృందం ఆదివారం ఓ ప్రత్యేక వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ వీడియోలో బ్రహ్మానందం సాంప్రదాయ వస్త్రధారణలో, ఎంతో భావోద్వేగంతో కనిపిస్తారు. "అమ్మా వారాహి, మా మహేంద్రగిరిని కాపాడు తల్లీ" అంటూ వారాహి అమ్మవారిని ప్రార్థిస్తున్న తీరు ఆకట్టుకుంటోంది. ఈ గ్లింప్స్‌లో ఆయన పాత్రలో హాస్య ఛాయలు ఏమాత్రం కనిపించలేదు. కథలోని దైవిక రహస్యాలతో ముడిపడిన ఓ గంభీరమైన పాత్రలో ఆయన నటిస్తున్నట్లు స్పష్టమవుతోంది.



# రవితేజ ఎనర్జీని మ్యాచ్ చేయడం కష్టం: ప్రియా భవానీ శంకర్

మాస్ మహారాజా రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమాలో ఆయన సరసన నటి ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రియా భవానీ శంకర్ మీడియాతో మాట్లాడుతూ సినిమా విశేషాలను పంచుకుంది. ఈ సినిమాలో తాను కావేరి అనే సాధారణ గృహిణి పాత్రలో కనిపిస్తానని ప్రియా చెప్పింది. "తాగుబోతు భర్త, అల్లరి చేసే కూతురితో సాగే మధ్యతరగతి గృహిణి పాత్ర నాది. ఈ పాత్ర వాస్తవానికి చాలా దగ్గరగా ఉంటుంది. ఇలాంటి పాత్ర చేయడం నాకు ఇదే తొలిసారి" అని ఆమె వివరించింది. 'ఇరుముడి' ఒక యాక్షన్ థ్రిల్లర్ అయినప్పటికీ బలమైన భావోద్వేగాలు ఉంటాయని, ముఖ్యంగా తండ్రీకూతుళ్ల మధ్య ఉండే ఎమోషన్ అందరినీ కదిలిస్తుందని వెల్లడించింది. రవితేజతో పనిచేయడంపై మాట్లాడుతూ.. "రవితేజ ఎనర్జీ అసాధారణం. దాన్ని మ్యాచ్ చేయడం చాలా కష్టం. అయితే ఈ సినిమాలో మీరు మునుపెన్నడూ చూడని ఒక కొత్త రవితేజను చూస్తారు" అని ప్రియా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. దర్శకుడు శివ నిర్వాణ కథను చెప్పిన విధానం, పాత్రలను మలిచిన తీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆమె ప్రశంసించింది. ప్రస్తుతం తాను 'దూత 2' సిరీస్ షూటింగ్‌లో పాల్గొంటున్నానని, 'డెమోంటే కాలనీ 3' కూడా విడుదలకు సిద్ధంగా ఉందని తన భవిష్యత్ ప్రాజెక్టుల గురించి ప్రియా భవానీ శంకర్ వెల్లడించింది.

# చుడైల్‌తో భయపెట్టనున్న సన్నీ లియోన్

బాలీవుడ్ నటి సన్నీ లియోన్ తన తదుపరి ప్రాజెక్టుల విజయం కోసం దైవ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం తన భర్త డేనియల్ వెబర్‌తో కలిసి ముంబైలోని ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించారు. త్వరలో ప్రారంభం కానున్న తన కొత్త సినిమా షూటింగ్ విజయవంతంగా పూర్తి కావాలని ఆకాంక్షిస్తూ ఆమె ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సంప్రదాయ దుస్తుల్లో సన్నీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పింక్ కలర్ ఎంబ్రాయిడరీ సల్వార్ సూట్‌లో ఆమె ఎంతో హుందాగా కనిపించారు. ఆమె భర్త డేనియల్ గ్రీన్ షర్ట్, క్రీమ్ ప్యాంట్‌తో కనిపించారు. ప్రస్తుతం సన్నీ లియోన్ ఒకవైపు సినిమాలు, మరోవైపు అంతర్జాతీయ ప్రదర్శనలతో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. ఇటీవల ఆమె 'డీజే వరల్డ్ టూర్' పేరుతో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. ఈ టూర్‌లో భాగంగా భారత్‌లోని ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, కొచ్చి నగరాలతో పాటు థాయ్‌లాండ్, కెనడా, గ్లాస్గో, డబ్లిన్ వంటి అంతర్జాతీయ నగరాల్లోనూ తన ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. త్వరలోనే ఆస్ట్రేలియాలో కూడా ఈ టూర్ జరగనుంది. ఇక సినిమాల విషయానికొస్తే, 'కెన్నడీ' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న సన్నీ, ప్రస్తుతం 'చుడైల్' అనే



హారర్ కామెడీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. టీఎల్‌వీ ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రాహుల్ దేవ్, మందన కరిమి ప్రధాన పాత్రలు పోషించారు. ఉత్తర ప్రదేశ్‌లోని బులంద్‌షహర్ వీధుల్లో తిరిగే ఒక దెయ్యం పాత్రలో సన్నీ కనిపించనుండగా, ఆమెకు పోటీగా మరో అతీతశక్తిగా మందనా కరీమి నటించారు.



# 'మల్లెపూల పల్లకి' మాస్ స్టెప్పులు!

మాస్ మహారాజా రవితేజ, దర్శకుడు శివ నిర్వాణ కాంబినేషన్‌లో వస్తున్న థ్రిల్లర్ అండ్ డివోషనల్ మూవీ 'ఇరుముడి'. ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉండగా, తాజాగా ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న స్పెషల్ సాంగ్ 'మల్లెపూల పల్లకి' విడుదలైంది. ఆదివారం (ఆగస్టు 16) రాత్రి జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో చిత్ర బృందం ఈ పాటను అధికారికంగా విడుదల చేసింది. ప్రముఖ ప్రైవేట్ ఆల్బమ్ సాంగ్ ఆధారంగా రూపొందిన ఈ పాటకు దప్పు శ్రీను గాత్రం అందించగా, చౌడం శ్రీనివాసరావు (వాసు) సాహిత్యం సమకూర్చారు. ఒరిజినల్ ఫ్లేవర్ మిస్ కాకుండా సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ అదే ట్యూన్‌ను కంటిన్యూ చేశారు. శేఖర్ మాస్టర్ కంపోజ్ చేసిన ఈ పాటకు రవితేజ తన ఎనర్జిటిక్ మాస్ స్టెప్పులతో అదరగొట్టారు.

# 'ప్రళయ్'గా వస్తున్న రణ్‌వీర్ సింగ్

భారత సినీ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన 'ధురంధర్: ది రివెంజ్' తర్వాత బాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రణ్‌వీర్ సింగ్ తన




తదుపరి భారీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. 'ప్రళయ్' పేరుతో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం షూటింగ్ ఆదివారం ముంబైలో ప్రారంభమైంది. పోస్ట్-అపోకలిప్టిక్ సర్వైవల్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణను ముంబై పరిసర ప్రాంతాల్లోని లైవ్ లొకేషన్లలో నిర్వహిస్తున్నారు. 'స్కామ్ 1992: ది హర్షద్ మెహతా స్టోరీ', 'లూటేరే' వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన సిరీస్‌లకు దర్శకత్వం వహించిన జై మెహతా ఈ చిత్రానికి దర్శకుడు. ప్రముఖ దర్శకుడు హన్సల్ మెహతా కుమారుడైన జై, చాలాకాలంగా ఈ కథపై పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్‌కు జోడీగా కాకుండా, ఓ కీలక పాత్రలో 'లోకా' ఫేమ్, మలయాళ నటి కల్యాణి ప్రియదర్శన్ నటిస్తున్నారు. కుప్పకూలుతున్న ప్రపంచంలో మనుగడ, ధైర్యం, విలువైన వాటి కోసం సాగే పోరాటమే ఈ చిత్ర కథాంశం.

# దుల్కర్, రామ్ అండగా నిలిచారు

ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తన సినీ జీవితంలో తనకు అండగా నిలిచే ఇద్దరు హీరోల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, తాను మనసు బాగోలేనప్పుడు, కష్టకాలంలో ఉన్నప్పుడు తనను ఓదార్చే స్నేహితులు ఇండస్ట్రీలో ఉన్నారని తెలిపారు. వారిలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, టాలీవుడ్ హీరో రామ్ పోతినేని ఉన్నారని వెల్లడించారు. తాను బాధలో ఉన్నప్పుడు గుర్తుకొచ్చే మొదటి పేరు దుల్కర్ సల్మాన్‌దేనని అనుపమ అన్నారు. "నేను ఎప్పుడు డల్‌గా ఉన్నా, దుల్కర్ నుంచి నాకు ఒక మెసేజ్ వస్తుంది. నేను బాధలో ఉన్న విషయం ఆయనకు ఎలా తెలుస్తుందో అని ఆశ్చర్యపోతాను. ఆయనతో కాసేపు మాట్లాడితే నా బాధ అంతా మాయమైపోతుంది" అని ఆమె వివరించారు. దుల్కర్ తర్వాత, తాను ఎక్కువగా విశ్వసించే మరో వ్యక్తి టాలీవుడ్ హీరో రామ్ అని అనుపమ తెలిపారు. వీరిద్దరితో ఉన్న స్నేహబంధం తనకెంతో విలువైందని ఆమె పేర్కొన్నారు. గతంలో అనుపమ, దుల్కర్ కలిసి మలయాళ చిత్రం 'జోమోంటే సువిశేషంగళ్'లో నటించిన విషయం తెలిసిందే.





# నిత్యామీనన్ హారర్ ఫాంటసీ

తెలుగు, తమిళం, కన్నడ సినీ పరిశ్రమల్లో తన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బ్యూటీ నిత్యామీనన్. రీసెంట్‌గా 'తలైవాన్ తలైవి', 'ఇడ్లీ కడై' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఆమె, చిన్న విరామం తర్వాత ఒక సరికొత్త హారర్ డ్రామాతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈసారి ఒక విభిన్నమైన ఫాంటసీ హారర్ థ్రిల్లర్ సబ్జెక్ట్‌తో ఆమె ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. 'యామిరుక్కా బయమే' చిత్రంతో వినోదాత్మక హారర్ జోనర్‌లో మంచి విజయాన్ని అందుకున్న దర్శకుడు డీకే ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనున్నట్లు టాక్. డీకే మార్క్ కామెడీ, సస్పెన్స్ ఎలిమెంట్స్‌కు నిత్యామీనన్ వంటి పవర్‌ఫుల్ నటి తోడవ్వడంతో ఈ చిత్రంపై అంచనాలు భారీగా నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ అక్టోబర్‌లో ప్రారంభం కానుండగా, వచ్చే ఏడాది సమ్మర్ రేసులో థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట.

# శ్రీనిధికి లక్కీ చాన్స్

కేజీఎఫ్' సినిమాతో దేశమంతటా గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శ్రీనిధి శెట్టి. 'కేజీఎఫ్ 2' తర్వాత వేరే భాషల్లో బిజీగా మారిన ఆమె, తమిళం, తెలుగు భాషల్లో పలు హిట్ సినిమాల్లో నటించి మెప్పించారు. అతి తక్కువ సమయంలోనే స్టార్స్ సరసన నటించి క్రేజీ హీరోయిన్‌గా మారారు. ప్రస్తుతం తెలుగులో వెంకటేష్ – త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రాబోతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇలా వేరే భాషల్లో వరస ఆఫర్లు పొందుతున్న సమయంలో, శ్రీనిధి శెట్టికి మళ్లీ కన్నడలో ఓ లక్కీ చాన్స్ దక్కినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. . తాజా సమాచారం ప్రకారం.. దర్శకుడు అనుప్ భండారి తెరకెక్కిస్తున్న కొత్త ప్రాజెక్ట్ ద్వారా ఆమె మళ్లీ కన్నడ ప్రేక్షకులను పలకరించబోతున్నారట. శ్రీనిధి రీ-ఎంట్రీతో ఈ సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దర్శకుడు అనుప్ భండారి, తన సోదరుడు నిరూప్ భండారితో కలిసి ఈ కొత్త సినిమాను మొదలుపెట్టినట్లు టాక్. ఇందులో హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టిని ఎంపిక చేయగా.. ఇప్పటికే కర్ణాటకలోని కుమ్టా ప్రాంతంలో ఈ సినిమా షూటింగ్ కూడా మొదలైందట. శ్రీనిధి శెట్టి 'కేజీఎఫ్' తర్వాత ఇక అనుప్ భండారి, నిరూప్ భండారి కలయికలో వస్తున్న నాలుగో సినిమా ఇది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'రంగీతరంగ', 'రాజరథ', 'విక్రాంత్ రోణా' చిత్రాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి.





# చైనాతో డ్రా

ఈవార్తలు–క్రీడావాణి: ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ వరల్డ్‌కప్‌ను భారత జట్టు డ్రాతో ఆరంభించింది. ఒలింపిక్ కాంస్య పతక విజేత చైనాతో ఆదివారం హోరాహోరీ మ్యాచ్‌లో ఆధిక్యంలో నిలిచిన టీమిండియా ఆఖర్లో పట్టుసడలించింది. పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసుకున్న చైనా 2–2తో స్కోర్ సమం చేసింది. దాంతో మన జట్టు గెలవాల్సిన మ్యాచ్ కాస్త డ్రాగా ముగిసింది. భారత్ తరఫున నవ్‌నీత్, దీపికలు చెరొక గోల్‌తో రాణించారు. ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్‌కప్‌లో భారత పురుషుల జట్టు అదిరే బోణీ కొట్టగా.. మహిళలు మాత్రం డ్రాతో సరిపెట్టుకున్నారు. వాగ్నర్ హాకీ స్టేడియంలో ఆదివారం చైనాను నిలువరించడంలో విఫలమైన టీమిండియా 2–2తో మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. మ్యాచ్ మొదలైన 8వ నిమిషంలోనే నేహ అందించిన పాస్‌ను నవ్‌నీత్ మెరుపు వేగంలో ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌లోకి పంపింది. అయితే.. 15వ నిమిషంలో ఝూంగ్ ఇంగ్ చైనాకు తొలి గోల్ అందించగా స్కోర్ 1–1తో సమం అయింది. రెండో అర్ధ భాగంలో దీపిక డ్రాగ్ ఫ్లిక్ గోల్‌తో ఆధిక్యంలో నిలిచిన భారత్ ఆపై బంతిపై నియంత్రణ కోల్పోయింది. పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసుకున్న చైనా 2–2తో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది.

## స్పెయిన్.. 21 విజయాల జైత్రయాత్ర

ఈవార్తలు–క్రీడావాణి: స్పెయిన్ ఫుట్‌బాల్ ఆటలోనే కాదు క్రికెట్‌లోనూ దూసుకెళ్తోంది. ఈ మధ్యే ఆ దేశ సాకర్ జట్టు ఫిఫా వరల్డ్‌కప్‌ను ఒడిసిపట్టగా.. తాజాగా స్పెయిన్ పురుషుల క్రికెట్ జట్టు ఆస్ట్రేలియా 'ఆల్‌టైమ్ రికార్డు'ను బ్రేక్ చేసింది. అంతర్జాతీయ టీ20ల్లో అనామక జట్టుగా అడుగుపెట్టి.. వరుసగా 21 విక్టరీలతో ఆసీస్‌ను రెండో స్థానానికి తోసేసిందీ యూరప్ జట్టు. అంతేకాదు 2028లో టీ20 వరల్డ్ కప్ బెర్తుకు గట్టి పోటీదారుగా మారింది స్పెయిన్. ప్రస్తుతం టీ20ల్లో 28వ ర్యాంకులో ఉన్న స్పెయిన్‌కు పొట్టి ఫార్మాట్‌లో ఇది వరసగా 21 విజయం. దాంతో, వరసగా 20 విజయాలతో రికార్డు నెలకొల్పిన ఆస్ట్రేలియా రెండో స్థానానికి పడిపోయింది. 2023 నుంచి 2026 మధ్య 21 విజయాలతో స్పెయిన్ ఈ మైలురాయిని అందుకుంది. ఈ క్రమంలో జెర్సీ, క్రొయేషియా, చెక్ రిపబ్లిక్, గ్రీస్, ఫిన్లాండ్ వంటి జట్లను ఓడించింది యూరప్ టీమ్.

## గాంధీ జయంతిన

## 2027 వరల్డ్ కప్ ప్రారంభం!



ఈవార్తలు–క్రీడావాణి: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిర్వహించనున్న 2027 పురుషుల వన్డే ప్రపంచకప్‌కు సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త వెలుగులోకి వచ్చింది. జాతిపిత మహాత్మా గాంధీకి నివాళిగా, ఈ మెగా టోర్నీని ఆయన జయంతి రోజైన అక్టోబర్ 2న ప్రారంభించాలని ఐసీసీ ప్రాథమికంగా నిర్ణయించింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ టోర్నీని గాంధీ జయంతి రోజున ప్రారంభించడం ద్వారా ఆయనకు ప్రత్యేక గౌరవం ఇవ్వాలని భావిస్తున్నారు. దక్షిణాఫ్రికాలో వర్ణవివక్షకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ చేసిన పోరాటం చారిత్రాత్మకం. తన జీవితంలో 21 సంవత్సరాలు (1893–1914) అక్కడే గడిపిన గాంధీజీ, సత్యాగ్రహ ఉద్యమానికి బీజం వేసింది కూడా అక్కడే. ఈ నేపథ్యంలో, దక్షిణాఫ్రికాలో గాంధీజీ సాగించిన వర్ణవివక్ష వ్యతిరేక పోరాటాన్ని, ఆయన అహింసా సిద్ధాంతాలను ప్రేరణగా తీసుకుని ఆ దేశ జాతిపిత నెల్సన్ మండేలా తదనంతర కాలంలో పోరాటం సాగించిన చారిత్రాత్మక బంధాన్ని స్మరించుకుంటూ.. ప్రపంచకప్‌ను ఆయన జయంతి రోజున ప్రారంభించడం సముచితంగా ఉంటుందని ఆతిథ్య దేశాల క్రికెట్ బోర్డులు భావిస్తున్నాయి. 2027 ప్రపంచకప్ ఫార్మాట్‌లో కీలక మార్పులు చేశారు. గత టోర్నీలో 10 జట్లు పాల్గొనగా, ఈసారి 14 జట్లతో నిర్వహించనున్నారు. ఈ జట్లను ఏడు చొప్పున రెండు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్–3లో నిలిచిన జట్లు 'సూపర్ సిక్స్' దశకు అర్హత సాధిస్తాయి. 2003 ప్రపంచకప్ తరహాలో ఈ ఫార్మాట్‌ను మళ్లీ ప్రవేశపెడుతున్నారు. ఈ మెగా టోర్నీకి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. ఆతిథ్య దేశాలుగా దక్షిణాఫ్రికా, జింబాబ్వేలకు టోర్నీలో నేరుగా ప్రవేశం లభించింది. అయితే, నమీబియా మాత్రం క్వాలిఫయర్స్ ద్వారా అర్హత సాధించాల్సి ఉంటుంది. మొత్తం 54 మ్యాచ్‌లను జోహన్నెస్‌బర్గ్, కేప్‌టౌన్, డర్బన్‌తో పాటు హరారే, విండ్‌హోక్ వంటి ప్రముఖ వేదికల్లో నిర్వహించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన చర్చల దశలోనే ఉంది. ప్రసార హక్కులు, మ్యాచ్‌ల షెడ్యూలింగ్ ఖరారైన తర్వాత ఐసీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. అక్టోబర్ 2న ప్రారంభమై సుమారు ఏడు వారాల పాటు ఈ టోర్నీ కొనసాగనుంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, క్రికెట్ వేదికగా మహాత్ముడికి ప్రపంచం అందించే గొప్ప గౌరవంగా ఇది నిలిచిపోతుంది.

## హండ్రెడ్ ట్రోఫీ.. ట్రెంట్ రాకెట్స్‌దే

### ఫైనల్లో సన్‌రైజర్స్ లీడ్స్ పరాజయం

ఈవార్తలు–క్రీడావాణి: మహిళల హండ్రెడ్ లీగ్‌లో కొత్త ఛాంపియన్ అవతరించింది. లార్డ్స్ వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్లో జయభేరి మోగించిన ట్రెంట్ రాకెట్స్ తమ కలను సాకారం చేసుకుంది. లీగ్ దశలో దుమ్మురేపిన సన్‌రైజర్స్ లీడ్స్‌ను టైటిల్ పోరులో 91 పరుగులకే కట్టడి చేసిన రాకెట్స్.. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన అష్లే గార్డ్‌నర్ సారథ్యంలోని రాకెట్స్ ది హండ్రెడ్ ట్రోఫీని ఎగరేసుకుపోయింది. ఇంగ్లండ్ గడ్డపై నిర్వహించిన మహిళల హండ్రెడ్ లీగ్ 2026 టైటిల్‌ను ట్రెంట్ రాకెట్స్ ఒడిసిపట్టింది. లార్డ్స్ మైదానంలో ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో సన్‌రైజర్స్ లీడ్స్‌పై భారీ విజయంతో ఛాంపియన్‌గా అవతరించింది రాకెట్స్.





# గాలే టెస్టు.. భారత్ పట్టు

### పడిక్కల్ భారీ ఇన్నింగ్స్.. కేఎల్, జురెల్ హాఫ్ సెంచరీలు

### 460/9 పరుగుల వద్ద టీమిండియా

ఈవార్తలు–క్రీడావాణి: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌పై టీమిండియా పూర్తి పట్టు సాధించింది. యువ ఓపెనర్ దేవదత్ పడిక్కల్ (167) బాదిన అద్భుత శతకానికి, కేఎల్ రాహుల్ (82), ధ్రువ్ జురెల్ (51) సాధించిన కీలక అర్ధ శతకాలు తోడవడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 9 వికెట్ల నష్టానికి 460 పరుగుల భారీ స్కోరు చేసింది.

**వర్షం కారణంగా రెండో రోజు ఆట ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ, భారత బ్యాటర్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. వర్షం వల్ల తొలి సెషన్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో, రెండో రోజు కేవలం 43 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఆట తిరిగి ప్రారంభమయ్యాక భారత బ్యాటర్లు వేగంగా పరుగులు రాబట్టారు. ముఖ్యంగా పడిక్కల్ తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ భారీ శతకాన్ని నమోదు చేశాడు.**



రాహుల్, వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. భారీ స్కోరు దిశగా సాగుతున్న భారత్‌ను శ్రీలంక స్పిన్నర్లు కొంతవరకు కట్టడి చేసే ప్రయత్నం చేశారు. అరంగేట్ర స్పిన్నర్ కేశర నువంత 3 వికెట్లు పడగొట్టగా, సీనియర్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య 4 వికెట్లతో రాణించాడు. రెండో కొత్త బంతితో లంక బౌలర్లు పుంజుకొని వరుసగా వికెట్లు తీశారు. రవీంద్ర జడేజా (13)ను నువంత ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ధ్రువ్ జురెల్ దూకుడుగా ఆడాడు. కేవలం 68 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 51 పరుగులు చేసి జట్టు స్కోరును 400 దాటించాడు. అయితే, అర్ధ శతకం పూర్తయిన వెంటనే జయసూర్య బౌలింగ్‌లో స్లిప్‌లో ఉన్న కెప్టెన్ ధనంజయ డిసిల్వా అద్భుతమైన డైవింగ్ క్యాచ్ పట్టడంతో జురెల్ వెనుదిరిగాడు. చివర్లో మహమ్మద్ సిరాజ్, మానవ్ సుతార్ (24) వేగంగా పరుగులు జోడించారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 116 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 460 పరుగులు చేసింది. క్రీజులో కుల్‌దీప్ యాదవ్ (12), ప్రసిద్ధ్ కృష్ణ (1) ఉన్నారు. కాగా, టీమిండియా తన ఇన్నింగ్స్ ను డిక్లేర్ చేసి, మూడో రోజు ఉదయాన్నే శ్రీలంకను బ్యాటింగ్ కు ఆహ్వానించి, వారి లైనప్ ను ఒత్తిడిలోకి నెట్టే అవకాశం ఉంది.

### జైస్వాల్ అరుదైన ఘనత

భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ టెస్ట్ క్రికెట్‌లో ఓ అరుదైన మైలురాయిని అందుకున్నాడు. శ్రీలంకతో గాలే వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో బరిలోకి దిగడం ద్వారా అతను భారత దిగ్గజ ఆటగాళ్లు సచిన్ టెండూల్కర్, సంజయ్ మంజ్రేకర్ క్లబ్‌లోకి చేరాడు. జైస్వాల్ తన కెరీర్‌లో ఆడిన 30 టెస్టులను 30 వేర్వేరు వేదికలపై ఆడటం విశేషం. గతంలో సంజయ్ మంజ్రేకర్ వరుసగా 33 టెస్టులు, సచిన్ టెండూల్కర్ 32 టెస్టులు వేర్వేరు మైదానాల్లో ఆడి ఈ జాబితాలో ముందున్నారు.

టెస్టు క్రికెట్‌లో బంగ్లాదేశ్ సంచలనం సృష్టించింది. ఆస్ట్రేలియా గడ్డపై ఆతిథ్య జట్టుకు చుక్కలు చూపిస్తూ చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. డార్విన్ వేదికగా జరిగిన సిరీస్‌లోని తొలి టెస్టులో కంగారూలను 9 వికెట్ల తేడాతో చిత్తు చేసి చరిత్రలో నిలిచిపోయే గెలుపును సొంతం చేసుకుంది. ఆస్ట్రేలియాలో బంగ్లాదేశ్‌కు ఇదే మొట్టమొదటి టెస్టు విజయం కావడం గమనార్హం.





# బంగ్లా బెబ్బులి!

### ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక విజయం.. టెస్టు క్రికెట్‌లో సంచలనం.. 2 టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో బంగ్లా

ఈవార్తలు–క్రీడావాణి:

బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించి ఆసీస్‌ను అన్ని విధాలా దెబ్బతీసింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా, బంగ్లా బౌలర్ల ధాటికి తలవంచింది. స్టీవ్ స్మిత్ (71) ఒక్కడే కాస్త ప్రతిఘటించినా, మిగతా బ్యాటర్లు విఫలమవడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా బౌలర్ హసన్ మహమూద్ 6 వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆడిన బంగ్లాదేశ్ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకుంది. యువ ఓపెనర్ తంజిద్ హసన్ (101) అద్భుత సెంచరీతో కదం తొక్కగా, నజ్ముల్ హొస్సేన్ శాంటో (84), మెహిదీ హసన్ మిరాజ్ (65) కీలక అర్ధ సెంచరీలతో రాణించారు. దీంతో బంగ్లా తమ తొలి ఇన్నింగ్స్‌లో 426 పరుగుల భారీ స్కోరు సాధించి, 228 పరుగుల కీలక ఆధిక్యాన్ని అందుకుంది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా మరోసారి తడబడింది. కామెరాన్ గ్రీన్ (104) ఒంటరి పోరాటంతో సెంచరీ సాధించినా, జట్టును ఆదుకోలేకపోయాడు. బంగ్లా స్పిన్నర్ మెహిదీ హసన్ మిరాజ్ 5 వికెట్లతో చెలరేగడంతో ఆస్ట్రేలియా 284 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో బంగ్లాదేశ్ ముందు 57 పరుగుల స్వల్ప లక్ష్యం నిలిచింది. ఈ సులువైన లక్ష్యాన్ని బంగ్లాదేశ్ ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. షాద్‌మాన్ ఇస్లాం (25 నాటౌట్), మోమినుల్ హక్ (30 నాటౌట్) నిలకడగా ఆడి జట్టుకు చారిత్రక విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో రెండు టెస్టుల సిరీస్‌లో బంగ్లాదేశ్ 1–0 ఆధిక్యంలో నిలిచింది. ఆస్ట్రేలియా వంటి బలమైన జట్టుపై వారి సొంత గడ్డపై సాధించిన ఈ విజయం బంగ్లా క్రికెట్ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుంది.

#### ప్రక్షాళన చేయాల్సిందే: పాంటింగ్

ఆస్ట్రేలియా క్రికెట్ జట్టులో ప్రక్షాళన చేయాల్సిందేనని మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ అభిప్రాయపడ్డాడు. స్వదేశంలో బంగ్లాదేశ్ చేతిలో డార్విన్ వేదికగా జరిగిన టెస్టులో ఆస్ట్రేలియా ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో పాంటింగ్ ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. జట్టు బ్యాటింగ్ లైనప్‌లో వెంటనే మార్పులు చేసి, యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశాడు. ఈ ఓటమి అత్యంత అవమానకరమని, జట్టులో మార్పులు చేయడం అనివార్యమని తాను భావిస్తున్నట్లు తెలిపాడు. "సాధారణంగా జట్టులో మార్పులు చేయాలని కోరుకునే వారిలో నేను చివరివాడిని.



ఒక కెప్టెన్‌గా లేదా ఆటగాడిగా జట్టును కలిపి ఉంచడానికే ప్రాధాన్యత ఇస్తాను. కానీ, పరిస్థితులు చేయి దాటినప్పుడు మార్పుల గురించి మాట్లాడక తప్పదు. జట్టు ప్రదర్శన చూశాక, మార్పులు చేయడం సరైనదనిపిస్తోంది. కొత్త ఓపెనర్‌ను, నంబర్ 3 స్థానంలో మరో ఆటగాడిని తీసుకురావడం ద్వారా జట్టు పెద్దగా నష్టపోయేదేమీ లేదు. ఈ ప్రక్షాళన కచ్చితంగా జరగాలి" అని వివరించాడు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467